ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 25.0



• దేవీనవరాత్రుల్లో భాగంగా మంగళవారం దుర్గాష్టమి కావడంతో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏలూరు పవర్ పేట శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవాలయంలో మహాదుర్గాదేవి అలంకారంలోని అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

చిన వెంకన్న కొండపై బ్రహ్మోత్సవ శోభ

రేపటి నుంచి తిరు కల్యాణోత్సవాలు

6వ తేదీ రాత్రి శ్రీవారి కల్యాణం.. 7న రథోత్సవం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల శేషాచలంపై కొలువుదీరిన చినవెంకన్న ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమై 9 వరకు వైఖానస ఆగమయుక్తంగా జరగనున్నాయి. గురువారం ఉదయం స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికు మార్తెలుగా చేస్తారు. 3న ధ్వజారోహణ, 5 రాత్రి 7 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం, 6 రాత్రి 8 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. 7న రాత్రి 8 గంటలకు రథోత్సవం, 8న శ్రీచక్ర వార్యుత్సవం, ధ్వజావరోహణ జరుగుతుంది. 9న ఉదయం 9గంటలకు చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి జరిగే ద్వాదశకోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 2 నుంచి 9వ తేదీ వరకు నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్టు తెలిపారు.

వాహన సేవలిలా..

బ్రహ్మోత్సవ సమయంలో స్వామి, అమ్మవార్లకు నిత్యం జరిగే వాహన సేవల నిమిత్తం వివిధ రకాల వాహనాలను సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. రోజుకో వాహనంలో అమ్మ వార్లతో కలసి శ్రీవారు వివిధ అలంకారాల్లో ఊరేగుతూ పురవీధుల్లో భక్తులను కటాక్షించనున్నారు. 2వ తేదీ రాత్రి 7గంటలకు గజవాహనంపై శ్రీవారి తిరువీధిసేవ, 3వ తేదీ రాత్రి 9 గంటలకు హంస వాహనంపై, 4వ తేదీ ఉదయం 7 గంటలకు సూర్యప్రభ, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనాలపై గ్రామోత్సవం, 5వ తేదీ ఉదయం 7 గంటలకు హనుమ ద్వాహనంపై, 6న రాత్రి 8 గంటలకు శ్రీవారి కల్యాణం, వెండి గరుడ వాహనాలపై, 7వ తేదీ రాత్రి 8 గంటలకు రథవాహనంపై శ్రీ వారి తిరు వీధిసేవ, 8వ తేదీ రాత్రి 9 గంటల అనంతరం అశ్వవాహన సేవ ఉంటాయి.





ధర్నా చేస్తున్న వైద్యులు

వైద్యుల సమ్మెబాట

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమ్మె విరమణకు ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో పురోగతి కనిపించకపోవడంతో పీహెచ్‌సీల వైద్యులు చేపట్టిన ఆందోళనలో భాగంగా మంగళవారం ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిరసన శిబిరం నిర్వహించారు. మరోవైపు పీహెచ్‌సీల్లో ఓపీ వైద్యసేవలను ఇప్పటికే నిలిపివేసిన వైద్యాధికారులు అత్యవసర కేసులను చూసేందుకు ఒక మెడికల్ ఆఫీసర్ చొప్పున ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో విధులకు హాజరయ్యేలా స్వచ్ఛంద నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రకారం పీహెచ్‌సీల్లో రెండో మెడికల్ ఆఫీసర్ నిర్వహించాల్సిన వైద్య సేవలను భర్తీ చేసేందుకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు మంగళవారం ఏర్పాట్లు చేశారు. బుధవారం నుంచి ఏపీ వైద్య విధాన పరిషత్‌కు చెందిన 15 మంది డాక్టర్లు, ప్రభుత్వ వైద్యకళాశాల వైద్యులు, నేషనల్ హెల్త్ మిషన్‌లో అదనంగా వున్న డాక్టర్లను పీహెచ్‌సీ విధులకు ప్రత్యామ్నాయంగా నియమించినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం వెల్లడించారు. ఇదిలా ఉండగా గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలుగా పనిచేస్తున్న హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో ప్రాథమిక వైద్య సేవల విధులు నిర్వర్తిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలను జిల్లాలోని పీహెచ్‌సీలన్నింటికీ మ్యాపింగ్ చేశారు.

నేడు ఏలూరులో వైద్యుల ర్యాలీ

పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో ఇన్‌సర్వీస్ ఎంబీబీఎస్ వైద్యాధికారులకు పలు రాష్ట్రాల్లో 30 నుంచి 50 శాతం వరకు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో తొలుతవున్న 30 శాతం రిజర్వేషన్‌ను గతేడాది 20 శాతానికి, ఈ ఏడాది 15 శాతానికి తగ్గించడంతో పాటు, బ్రాంచ్‌లను పరిమితం చేయడం వల్ల న్యాయంకోసం సమ్మెకు దిగాల్సి వచ్చిందని వివరిస్తూ మంగళవారం పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఏపీ పీహెచ్‌సీల వైద్యుల సంఘం జిల్లా నాయకులు డాక్టర్ గంగాభవాని, డాక్టర్ షేక్ జోషిమా, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జ్ఞానేష్ మాట్లాడుతూ బుధవారం సాయంత్రం డీఎం హెచ్‌వో కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు.



కా..ఫీ.. అంటే కాస్త ఫీలింగ్. ఉదయాన్నే పొగలు కక్కే చిక్కటి కాఫీ రుచి చూడనిదే చాలా మందికి తెల్లారదు. నాలుకపై కాఫీ నర్తించనిదే మంచంపై నుంచి కాలు కిందకు దిగదు. రోజు రీ ఫ్రెష్ కావాలంటే.. బెడ్ కాఫీ పడాల్సిందే అనేవారు ఎందరో..! అలాంటి కాఫీతోనే గోదావరి జిల్లా మర్యాద మొదలవుతుంది. మత్తు పానీయం మాదిరి కాఫీ కూడా వ్యసనమే అయినప్పటికి ఇది చేసే మేలు తక్కువేమీ కాదు. నేడు ఇంటర్నేషనల్ కాఫీ డే సందర్భంగా.. మనమూ కాఫీ రుచిని ఆస్వాదిస్తూ.. దీని వెనుక కథను తెలుసుకుందాం.

(పాలకొల్లు-ఆంధ్రజ్యోతి)

'అయ్యయ్యో.. అలా వచ్చి ఇలా వెళ్లిపోతున్నారేమిటండి.. కాస్త కాఫీ అయినా తాగి వెళ్లండి'.. ఇదీ గోదావరి జిల్లాల్లో ఇంటికి వచ్చిన అతిథులకు ఇచ్చే మర్యాద. అలాంటి కాఫీ వెనుక పెద్ద చరిత్రే వుంది. ఇదివరకు కాఫీ అంటే ఫిల్టర్ కాఫీ ఒక్కటే. అంత సమయం లేదండీ.. అనుకునే వాళ్లంతా ఇన్‌స్టెంట్ కాఫీ రుచులను ఆస్వాదిస్తుంటారు. ఇప్పుడు ఎన్నో రకాలొచ్చేశాయి. బ్లాక్ కాఫీ, కోల్డ్ కాఫీ, చాక్లెట్ కాఫీ.. ఇంకా చాలా ఉన్నాయ్. ఓసారి కాఫీ డేకో, కాఫీ షాప్‌కో వెళితే ఇన్ని కాఫీలు ఉన్నాయా ? అని ఆశ్చర్యపోవడం మనవంతవుతుంది..

జీవితంలో కాఫీ.. ఒక భాగం



తెల్లవారుజామునే లేచి కాఫీ పెట్టుకుని తాగుతా. ఆ తర్వాతే ఇంటి పనులు చేసుకుంటా. ఇప్పుడు నా వయసు 73 ఏళ్లు. 53 ఏళ్లుగా కాఫీ తాగుతున్నా. అప్పట్లో కాఫీ గింజలను ఆడించి అమ్మేవారు. మంచి సువాసనతో ఉండేది. ఇప్పుడంతా రెడీమేడ్ వచ్చాయి.. అప్పటి రుచి ఇప్పుడు కుదరడం లేదు.. వేరు ఊరు వెళ్లినా కాఫీ అంత సంతృప్తిగా ఉండదు. ఎందుకంటే సొంతూర్లో పాడి గేదె పాలతో పెట్టిన కాఫీ రుచే వేరు.

- శింగులూరి అన్నపూర్ణ, తెల్లంవారిగూడెం

కాఫీ కోసం టూర్ మధ్యలో వచ్చేశా !



చిన్నప్పటి నుంచి కాఫీ అంటే ఎంతో ఇష్టం. కాఫీ లేనిదే రోజు ప్రారంభం కాదు. ఒకవేళ బయటకు వెళ్లినా కాఫీ కోసమే రాత్రికి ఇంటికి వచ్చి తీరాల్సిందే. ఒకసారి టూర్‌కి వెళ్లిన సమయంలో కాఫీ సమస్య తలెత్తింది. ఎక్కడా కాఫీ దొరక్కపోవడంతో చాలా ఇబ్బంది పడ్డాను. చివరికి కాఫీ కోసమే ఆ టూర్ మధ్యలోనే వచ్చేశాను. తరవాత ఎక్కడికి వెళ్లినా కాఫీ పొడి వెంటపెట్టుకుని వెళుతుంటా.

- గమిడి మల్లికార్జునరావు, నీలాద్రిపురం

కాఫీ పుట్టింది ఇలా..

కాఫీ చెట్ల నుంచి లభించే గింజలను శుద్ధి చేసి ఎండబెట్టి, పొడి చేసి కాఫీ తయారీకి వినియోగిస్తారని తెలిసిందే. అనేక దేశాల్లో కాఫీ పంటను సాగు చేస్తుండగా, అరకు మన్యంలో కాఫీ సాగు ఎప్పుడో మొదలైంది. నిజానికి ఇతర దేశాల్లో కాఫీ గింజలను వేయించి, పొడి చేసి దాన్ని నీటితో మరిగించి, ఆ నీటిని వడగట్టి కాఫీ డికాక్షన్ తయారు చేసి పంచదారను చేర్చి తాగేవారు. మనవాళ్లు మాత్రం కాఫీ డికాక్షన్‌కు పాలను చేర్చి చిక్కటి కాఫీ తాగడం కొత్త అలవాటు. ఇక వేడి వేడి పొగలు కక్కే కాఫీ తాగడం పాత సంప్రదాయం. చల్లని ఐసు ముక్కలతో కూడిన కోల్డ్‌కాఫీలను ఆస్వాదించడం కొత్త అలవాటు. అయినా ఎవరి టేస్టు వారిది.. ఎవరి ట్రెండ్ వారిది.

రోజుకు పది లక్షల మంది సేవిస్తారు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నిత్యం కాఫీని ఆస్వాదించేవారు 10 లక్షలకు పైమాటే. ప్రతీ నలుగురిలో ఒకరు ఉదయాన్నే కాఫీని ఆస్వాదిస్తారు. కాఫీలో నాడీ వ్యవస్థను ఉత్తేజపరిచే కెఫెన్ అనే పదార్థం ఉండటం కారణంగా కాఫీ తాగిన వారిలో ఒక రకమైన ఉత్తేజం కనిపిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా మూడు బిలియన్ల మంది నిత్యం కాఫీని సేవిస్తారు. ఇథియోపియాలో తొలిసారి 870వ సంవత్సరంలో కాఫీ గింజలను ఉపయోగించారు. మనదేశంలో ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచలప్రదేశ్, త్రిపుర, మిజోరాం, అసోం, మణిపూర్, మేఘాలయ రాష్ట్రాలలో మూడో వంతు కాఫీ గింజలను ఉత్పత్తి చేస్తున్నారు. కేరళలో 21 శాతం కాఫీ పండిస్తుండగా కర్ణాటకలో 71 శాతం అత్యధికంగా కాఫీ తోటలు ఉన్నాయి. ఇక మన రాష్ట్రంలో అరకు ప్రాంతంలోని కాఫీ ఉత్పత్తికి జాతీయస్థాయి అవార్డు వచ్చింది. ప్రధాని మోదీ సైతం అరకు కాఫీ రుచి చూసి అబ్బురపడ్డారు. ఈ కాఫీకి ఇప్పుడు అంతర్జాతీయంగా మంచి మార్కెట్ ఉంది. అందులోనూ కావేరీ రకం కాఫీకి చాలా డిమాండు ఉంది. గిరిజన సహకార సంస్థ అరకు బ్రాండ్ పేరుతో ఈ కాఫీ పొడిని మార్కెట్ చేస్తోంది. కాఫీ గింజలు పండించే రైతులకు మద్దతును ఇస్తూ కాఫీ ప్రేమికులు తొలిసారిగా 2015 అక్టోబరు 1న వరల్డ్ కాఫీ డే నిర్వహించారు. అప్పటి నుంచి ఏటా దీనిని నిర్వహిస్తున్నారు.

కాఫీ కప్పు స్పెషల్

కాఫీకి ఎంత గుర్తింపు ఉందో అది తాగే కప్పుకీ అంతే క్రేజ్. పూర్వం ఇత్తడి చెంబుల్లో తాగేవారు. తర్వాత మట్టి, స్టీలు, గాజు, పింగాణీ కప్పులు.. కప్పు సాసర్లలో కొంత కాలం.. ఇప్పుడు కాఫీ కప్పులంటేనే వేలల్లో మోడళ్లు. కాఫీ తాగాలంటే తనకంటూ సొంతంగా ఓ కప్పు ఉండి తీరాల్సిందే. రుచిగా కాఫీ తాగడమే కాదండోయ్..తాగే కప్పు ప్రత్యేకమేనని కాఫీ ప్రియుల ఫీలింగ్.

పాలతో కాఫీ బెటర్

గోదావరి జిల్లాల్లో 90 శాతం మందికిపైగా కాఫీ ప్రియులు కాఫీ పొడిని పాలతో కలిపి సేవిస్తుండగా తక్కువ సంఖ్యలో బ్లాక్ కాఫీ తాగుతున్నారు. ఆరోగ్య రక్షణ చర్మ సౌందర్యం పేరుతో సంపన్న వర్గాలలో ఐదు శాతం బ్లాక్ కాఫీనే సేవిస్తున్నారు. కాఫీ తాగే వారిలో జుట్టు నిగారింపు ఉండటమే కాకుండా చర్మం బిగుతుగా ఉంటుందని కాఫీ ప్రియులు విశ్వసిస్తారు. శరీరంపై నల్ల మచ్చలు ముఖంపై మొటిమలు తగ్గుతాయని, ముఖ కదలికల్లో ఎప్పుడు నూతనోత్తేజం కనిపిస్తుందని కాఫీ ప్రియులు విశ్వసిస్తారు. అయితే అధికంగా సేవిస్తే ఏసిడిటీతో పాటు పలు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. మితంగా సేవిస్తే మంచిదే..!

బెల్లం శొంఠి కాఫీతో ఆరోగ్యం

కాఫీలు పలు రకాలు. పూర్వం శొంఠి బెల్లం కాఫీ ఒకటి. వంటింట్లో లభించే సుగంధాలతోనే దీన్ని తయారు చేయడంలో మన అమ్మమ్మలు, నాన మ్మలు సిద్ధహస్తులు. 20 గ్రాముల శొంటిపొడి, 10 గ్రాముల మిరియాల పొడి, 10 గ్రాముల బెల్లం పొడి తీసుకోవాలి. రెండు కప్పుల నీరు గిన్నెలో పోసి స్టౌవ్‌పై పెట్టి దాన్ని మరిగించి శొంఠి, మిరియాల మిశ్రమాన్ని వేసి మరిగించాలి. ఐదు నిమిషాలలోపు మరిగించి దానిని వడిగట్టి మరొక గిన్నెలో వేయాలి. రెండు కప్పుల పాలను తీసుకుని స్టౌవ్‌పై మరిగించి దానిని దించే ముందు శొంఠి ద్రావణాన్ని పాలలో వేసి వెంటనే బెల్లం పొడి వేసి కలిపి స్టౌ కట్టేసి దాన్ని దించి గ్లాస్‌లో తొరిపి తాగేయడమే...ఈ కాఫీ తాగడం వల్ల దగ్గు, జలుబు, శ్వాస సమస్యలు తగ్గుతాయని, జీర్ణశక్తి పెరుగుతుందని చెబుతారు మరి.

కాఫీ ప్రియులకో క్లబ్ !

భీమవరం టౌన్(ఆంధ్రజ్యోతి): భీమవరంలో పలువురు కాఫీ ప్రియులు కలసి కాఫీ క్లబ్ ఏర్పాటు చేసుకుంటే ఎలా ఉంటుందన్న ఆలోచనే మార్నింగ్ కాఫీ క్లబ్ ఏర్పాటు అయింది. 2021 మార్చి 12న 50 మంది సభ్యులతో క్లబ్ ప్రారంభమైంది. డీఎన్ఆర్ కళాశాల గన్నాబత్తుల వారి ఆటస్థలంలో క్లబ్ సభ్యులు అప్పటినుంచి ప్రతీరోజు ఉదయం కలుసుకుంటారు. కాఫీ తాగుతూ ఆరోజు కాఫీ కలిపిన కాఫీ బాయ్‌ను సత్కరించడం అనవాయితీగా వస్తోంది. కాఫీ రుచిన ఆస్వాదీస్తు క్లబ్ తరుపున చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలను నిర్ణయించుకుంటారు. క్లబ్ ఫౌండర్, కన్వీనర్‌గా బొండా రాంబాబు, కో-కన్వీనర్‌గా ఓలేటి శ్రీను, పీఆర్‌వోగా భట్టిప్రోలు శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు.





వేలేరుపాడు- రుద్రమ్మకోట రహదారిపై వరద నీరు

ముంచుకొస్తున్న గోదావరి

వేలేరుపాడు/కుక్కునూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద ముంచుకొస్తోంది. మంగళవారం ఉదయం తెలంగాణలోని భద్రాచలం వద్ద 48.70 అడుగుల నీటిమట్టం నమోదుకాగా సాయంత్రానికి 50 అడుగులకు చేరుకుంది. 48 అడుగుల నీటిమట్టం నమోదు కావడంతో భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. తెలంగాణలోని గోదావరిపై నిర్మించిన ప్రాజెక్టుల నుంచి 12 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలి పెడుతున్నారు. దీనికారణంగా భద్రాచలం వద్ద 10లక్షల 50 వేల క్యూసెక్కులు దిగువకు వస్తుండడం, పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంతో వరదనీరు కిందకు వెళ్లలేక వేలేరుపాడు మండలంలోని పల్లపు ప్రాంతాల వరకు వరద భారీగా చేరుతోంది. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని పలు రహదారులు నీటమునగడంతో పాటు ఇటీవలే రైతులు సాగు చేపట్టిన మిరపపంట వరదలో మునిగిపోవడంతో రైతులకు భారీగా నష్టం ఏర్పడింది. వేలేరుపాడు మండలంలో సుమారు 400 ఎకరాల పైనే వరదలో మునిగింది. కుక్కునూరు తహసీల్దార్ రమేశ్‌బాబు ముంపునకు గురైన గ్రామాలను క్షేత్రస్థాయిలో వెళ్లి ప్రజలను అప్రమత్తం చేశారు.

ముంపులో పంటపొలాలు

పోలవరం: పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం మంగళవారం అనూహ్యంగా పెరిగింది. పాత పోలవరం కడెమ్మ స్లూయిజ్ వద్ద వరద జలాలతో గేట్లు మూసుకుపోవడంతో ఏటిగట్టుకి కుడివైపున ఉన్న పంటపొలాలు నీట మునిగాయి. పాత పోలవరం కడెమ్మ వంతెనకు సమాంతరంగా వరద జలాలు ప్రవహిస్తున్నాయి. నీటిమట్టం మరో మూడడుగులు పెరిగితే కడెమ్మ వంతెన నీటిమునిగే అవకాశాలున్నాయి.

అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్

ఏలూరుసిటీ : గోదావరి వరద పోటెత్తుతున్న నేపథ్యంలో తెలంగాణలోని భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయిన దృష్ట్యా జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను మంగళవారం ఓ ప్రకటనలో ఆదేశించారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు బోట్లు, గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలని, ముంపు ప్రమాదం ఉండే ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. నెలకు సరిపడా నిత్యావసర సరుకులను ముంపు ప్రాంతాల్లో సిద్ధం చేయాలని ఆదేశించారు.

నేడు పింఛన్ల పండుగ

» 2,60 లక్షల మంది లబ్ధిదారులకు రూ. 114.14 కోట్లు పంపిణీ

ఏలూరుసిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు నెల సామాజిక పింఛన్ల పంపిణీకి జిల్లాలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు ఒకటో తేదీ బుధవారం ఉదయం 7గంటలకు పంపిణీ ప్రారంభం అవుతుంది. 5,175 మంది గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందితో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 2,60,765 మంది లబ్ధిదారులకు 114 కోట్ల 14 లక్షల 7వేల రూపాయలు పంపిణీ చేయనున్నారు. అనివార్య కారణాల వల్ల తీసుకోని వారికి 3వ తేదీన పంపిణీ చేస్తారని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.

పింఛన్ రకం	లబ్ధిదారుల సంఖ్య	పింఛన్ మొత్తం(రూ)
అభయహస్తం	4,542	23,67,000
అమరావతి లాండ్‌లెస్‌పూర్	7	35,000
డప్పుకళాకారులు	2,010	80,84,000
విభిన్నప్రతిభావంతులు	32,722	19,98,36,000
మత్స్యకారులు	6,059	2,52,88,000
కళాకారుల పెన్షన్	161	6,56,000
వృద్ధాప్య	1,31,826	5,27,304,000
సైనికవెల్ఫేర్	15	90,000
సింగిల్ ఉమెన్	8,228	3,37,60,000
తలసేమియా	72	7,20,000
కల్లుగీత కార్మికులు	4,451	1,79,72,000
చర్మకారులు	1,640	66,00,000
ట్రాన్స్‌జెండర్	74	3,56,000
నేత కార్మికులు	1,094	44,32,000
వితంతు	73,228	30,20,52,000
డీఎంహెచ్‌వో	2,471	3,12,95,000
మొత్తం	**2,60,765**	**114,14,07,000**



ఏలూరు బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

ఆర్టీసీకి దసరా రద్దీ

కిటకిటలాడుతున్న బస్సులు.. స్పెషల్ బస్సులు సిద్ధం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి): దసరా పండుగ వేళ ఆర్టీసీ బస్సుల్లో రద్దీ మొదలైంది. ఒకవైపు పండుగకు స్వస్థలాలకు వచ్చేవారితో పాటు, స్కూళ్లకు సెలవులు కావడంతో విహార యాత్రలు, తీర్థయాత్రలకు వెళ్లిన వారు తిరిగి వస్తుండడంతో బస్టాండ్లు ప్రయాణికులతో కళకళలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోల నుంచి 13 సూపర్ లగ్జరీ, ఆల్ట్రా డీలక్స్ సర్వీసులను విజయవాడ మీదుగా హైదరాబాద్‌కు ప్రారంభించారు. రద్దీకి అనుగుణంగానే ఇప్పుడున్న పల్లెవెలుగు బస్సులను విజయవాడకు నాన్‌స్టాప్ సర్వీస్‌గా రూ.90 చార్జితో ఆర్టీసీ నడుపుతోంది. దుర్గమ్మ దర్శనాలకు ఏలూరు మీదుగా ఎక్కువ మంది వెళుతుండటంతో ఎక్స్‌ప్రెస్ సర్వీసులను కొద్దిరోజుల నుంచి పెంచారు. ప్రస్తుతం 20కు పైగా సర్వీసులను విజయవాడకు నడుపుతున్నారు.

ఆదాయంపై అంచనాల్లేవ్...

ఉచిత బస్సుల నిర్వహణలతో ఆదాయం కళ్లచూడని ఆర్టీసీ యాజమాన్యం దసరా స్పెషల్ బస్సులపైనే ఆశలు పెట్టుకుంది. అయితే ఎంత ఆదాయం వస్తుందనేది అంచనాలు పెట్టుకోలేదని చెబుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో దసరా ఉత్సవాలు ప్రారంభ రోజు నుంచి 78 శాతం ఆక్యుపెన్సీ రేషియో ఉండగా, కొద్ది రోజుల నుంచి 98-100 ఆక్యుపెన్సీ రేషియోకు చేరుకుంది. ఎక్కడా రేట్లు పెంచకుండానే బస్సులను నడుపుతున్నారు. హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ రూ.750, అల్ట్రాడీలక్స్ రూ.700 మేర చార్జ్ చేస్తున్నారు.

10 బస్సులకు రిజర్వేషన్లు

హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులకు ఆన్‌లైన్ రిజర్వేషన్లు ఆర్టీసీ ప్రారంభించింది. 4,5 తేదీలకు మొత్తం 10 బస్సులకు రిజర్వేషన్లు ప్రారంభించింది. బుధవారం నాటికి పూర్తిస్థాయిలో రిజర్వేషన్లు పూర్తి కావొచ్చని అధికారులు చెబుతున్నారు. తర్వాత మరో 10 బస్సులకు రిజర్వేషన్లు చార్టు ఓపెన్ చేయనున్నారు.



బస్సులను సిద్ధం చేశాం..

ప్రస్తుతానికి రద్దీకి అనుగుణంగా బస్సులను నడుపుతున్నాం. అక్టోబరు రెండో తేదీ దాటాక ప్రయాణికుల తాకిడి ఉంటుందని భావిస్తున్నాం. అప్పటి నుంచి అవసరమైతే బస్సులను రప్పించి మూడు బస్ డిపోల నుంచి అదనంగా బస్సులను తిప్పడానికి సిద్ధంగా ఉన్నాం. విజయవాడ మీదుగా హైదరాబాద్‌కు ఎక్కువగా నడిపేందుకు ప్రాధాన్యం ఇచ్చాం.

-షేక్ షబ్నం, డీపీటీవో

కొత్త టీచర్లకు నాలుగు కేంద్రాల్లో ఇండక్షన్ ట్రైనింగ్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నూతనంగా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన వారికి అక్టోబరు 3నుంచి 10వ తేదీ వరకు ఇండక్షన్ ట్రైనింగ్ నిమిత్తం ఉమ్మడి జిల్లాలో కేంద్రాలను ఖరారు చేసినట్టు డీఈవో, డీఎస్సీ కన్వీనర్ ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. రెసిడెన్షియల్ విధానంలో జరిగే శిక్షణకు సంబంధిత ఉపాధ్యాయులందరూ ఖచ్చి తంగా హాజరు కావాల్సిందేనని ఆదేశించారు. శిక్షణకు హాజరై, పూర్తిచేసుకున్న వారికి మాత్రమే పాఠశాలల్లో విధులు చేపట్టేం దుకు పోస్టింగ్స్ ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. శిక్షణ శిబిరానికి ఫార్మల్ డ్రెస్‌కోడ్‌ను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందన్నారు.

శిక్షణ వేదికలివే..

- స్కూల్ అసిస్టెంట్స్ తెలుగు, హిందీ, ఇంగ్లీషు, సంస్కృతం, గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం సబ్జెక్టుల టీచర్లకు భీమవరం గొల్లలకోడేరు రోడ్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూలు.
- స్కూల్ అసిస్టెంట్స్ సోషల్ స్టడీస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకు నరసాపురం, సీతారాంపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల.
- సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)కు తణుకు ఓల్డ్ టౌన్ ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల. భీమవరం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని సీఎస్ఎన్ డిగ్రీ కళాశాల.



ఎమ్మెల్యే చింతమనేనికి కృతజ్ఞతలు చెబుతున్న డీఎస్సీ విజేతలు

మీరిచ్చిన శిక్షణతోనే ఉద్యోగం

ఎమ్మెల్యే చింతమనేనికి నూతన ఉపాధ్యాయుల కృతజ్ఞతలు

పెదవేగి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):'మీరు అందించిన శిక్షణతో మేము ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందాము.. మిమ్మల్ని జీవితాంతం గుర్తుంచుకుంటాం.. మీరు అందించిన ఈ ఉద్యోగంలో పిల్లల భవిష్యత్‌ను ఉన్నతంగా మార్చడానికి కృషి చేస్తాం..' అంటూ డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయ అభ్యర్థులు నియామక పత్రాలతో దుగ్గిరాల కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రభాకర్‌ను మంగళవారం కలిశారు. మీ స్ఫూర్తితో ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తామని చెప్పారు. నాలుగు నెలలపాటు ఎంతో వ్యయంతో ఇప్పించిన శిక్షణ ఎంతో ఉపయోగపడిందని, ఈరోజు ఉపాధ్యాయులుగా మీ ముందుకు రాగలిగామని వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రభాకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందిన మీరంతా సేవాగుణాన్ని అందిపుచ్చుకుని, జీవితంలో మరింతమందికి సాయం అందించేలా ఎదగాలని సూచించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల వినతులు స్వీకరించి, పరిష్కారానికి అనువుగా చర్యలు తీసుకున్నారు.

జిమ్నాస్టిక్స్‌లో ఏలూరు క్రీడాకారుడి ప్రతిభ



సాయి అభిరామ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిమ్నాస్టిక్స్‌లో ఏలూరు క్రీడాకారుడు జంకల సాయి అభిరామ్ ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించాడు. వెంకటాపురం పంచాయితీ ఎన్టీయార్ కాలనీకి చెందిన జంకల సాయి అభిరామ్ ఇటీవల డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయస్థాయి ట్రా పోలింగ్, తంబ్లింగ్, జిమ్నాస్టిక్స్‌లో రజత పతకం సాధించాడు. ఎమ్మెల్యే బడేటి చంటిని సాయి అభిరామ్ కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. సాయి అభిరామ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. పైడి వెంకట్రావు, పి.భాస్కరరావు, చౌదరి, పి.సాంబశివరావు పాల్గొన్నారు.

కేవీఎస్ సంగీత పురస్కారం ప్రదానం



పురస్కారం ప్రధానం చేస్తున్న ప్రతినిధులు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా రామచంద్రరావు పేట వేద పాఠశాలలో ఫైర్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో భాగంగా కేవీఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత కళాకారిణి పరిమి సావిత్రికి కెవి సత్యనారాయణ సంగీత పురస్కారం ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. సంగీత ఉపాధ్యాయురాలిగా సేవలందించి ఎంతో మంది విద్యార్థిని, విద్యార్థులకు సంగీతంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డివి రమణ, ఎల్ వెంకటేశ్వరరావు, పుల్లబొట్ల పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి చదువుకు రూ.2.6 లక్షల ఆర్థిక సాయం



కలగర హరిచరణ్

ఏలూరు రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలం చాటపర్రుకు చెందిన కలగర హరిచరణ్ సాయి 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించాడు. సీఏ కోర్సు చేయడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో నెక్స్ట్ జెన్ ఫీడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఆడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం రూ.2.6 లక్షలు అందించడానికి ముందుకు వచ్చారు. కోర్సుకు చేయడానికి రూ.6 లక్షలు ఖర్చవుతుండగా రూ.2.6 లక్షలు తమ సంస్థ నుంచి ఉపకారవేతనం రూపంలో అందజేయనున్నట్లు ఆయన ప్రకటించారని ఎస్ఎస్.రాజు తెలిపారు. దాతల సహకారంతో పేద విద్యార్థుల భవిష్యత్‌లో మరింత రాణిస్తారన్నారు. ఈసందర్భంగా నెక్స్ట్ జెన్ అధినేతకు కృతజ్ఞతలు తెలిపారు.

సహకార సంఘ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల సహకార సంఘం అభివృద్ధికి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సహకారంతో కృషి చేస్తానని చైర్మన్ పోలిన శ్రీనివాసరావు అన్నారు. సొసైటీ మహాజన సభ ఆయన అధ్యక్షతన మంగళవారం జరిగింది. గోపాలపురం ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రైతు అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు. సహకార సంఘం ద్వారా రైతులకు అందించే సేవలను ఆయన వివరించారు. సొసైటీ కార్యదర్శి కిశోర్ సొసైటీ ప్రగతిని తెలియజేశారు. కార్యక్రమంలో రామన్నగూడెం, గుండుగొలనుకుంట సొసైటీ చైర్మన్లు మద్రాస్ రాము, అద్దంకి శేఖర్, నేతలు పాకలపాటి గాంధీ, ఏపూరి దాలయ్య, నేతలు రైతులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలో డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేయడం వల్ల రాత్రి వేళ, పగటి వేళ గంజాయి తాగే ముఠాల గుట్టు రట్టు చేస్తున్నారు. డ్రోన్ ఆపరేటింగ్ ప్రత్యేక పోలీసులు సోమవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. బీడీ కాలనీ ఏటిగట్టు ప్రాంతంలో ఇద్దరు యువకులు గంజాయి విక్రయిస్తున్నట్లు మరో ఇద్దరు యువకులు గంజాయి తాగుతున్నట్లు గుర్తించారు. వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ తన సిబ్బందితో వెళ్లి గంజాయి కలిగి ఉన్న తాపీమేస్త్రి కాలనీకి చెందిన దుద్దే ప్రశాంత్‌కుమార్ (25), బీడీ కాలనీ మూడో రోడ్డు ద్వారకానగర్‌కు చెందిన సిద్ధాంతపు రాము (42)ను అరెస్టు చేశారు. వారి నుంచి 2 కేజీల 396 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధిస్తూ ఆదేశించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



స్వామివారి దర్శనార్థం క్యూలైన్లలో వెళుతున్న భవానీ భక్తులు

చిన్న వెంకన్నను దర్శించిన భవానీ భక్తులు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): చిన్న వెంకన్న క్షేత్రం మంగళవారం భవానీ భక్తులతో కళకళలాడింది. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లే దీక్షాదారులు తిరుగు ప్రయాణంలో ద్వారకాతిరుమలను దర్శిస్తున్నారు. విశాఖపట్నం, విజయనగరం, రాజమండ్రి, కాకినాడ తదితర ప్రాంతాలకు చెందిన భవానీ భక్తులు ద్వారకా తిరుమలకు రావడంతో క్షేత్రం దసరా కళను సంతరించుకుంది.



తాడేపల్లిగూడెం బలుసులమ్మ ఆలయంలో కుంకుమ పూజలు



పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరాలయంలో దుర్గమ్మగా పార్వతీదేవి



జీలుగుమిల్లిలో అమ్మవారి ఆలయంలో చిన్నారులు

అమ్మా.. దుర్గమ్మా..

భీమవరం టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. సామూహిక కుంకుమ పూజలు, సహస్ర నామార్చన నిర్వహిస్తున్నారు. పలుచోట్ల వివిధ అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భీమవరం మావుళ్లమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గా దేవీ అమ్మవారుగా దర్శనమిచ్చారు. తెల్లవారుజామున ఆలయ ప్రధాన అర్చకులు మద్దరాల మల్లికార్జునశర్మ సంప్రోక్షణ చేసి అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరాలయంలో పార్వతీదేవి, పెనుగొండ వాసవీ మాత దుర్గాదేవిగా భక్తులను కరుణించారు. తాడేపల్లిగూడెం బలుసులమ్మ వన దేవతగా దర్శనమిచ్చారు.

ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న క్షేత్రదేవత కుంకుళ్లమ్మ మంగళవారం భక్తజనులకు శ్రీదుర్గాదేవిగా దర్శనభాగ్యాన్ని కల్పించారు. సింహ వాహనాన్ని అధిరోహించి, అష్టభుజాలతో, ఆయుధ ధారిణియై, ఉగ్రరూపంలో ఉన్న కుంకుళ్లమ్మను పలువురు భక్తులు దర్శించి తరించారు. ఉగ్రరూపంలో ఉన్నా భక్తులపై కరుణ కురిపించే అమ్మను దర్శిస్తే దుర్గతుల నుంచి తప్పించుకోవచ్చన్నది భక్తుల నమ్మకం.



దుర్గాదేవిగా దర్శనమిచ్చిన భీమవరం మావుళ్లమ్మ, ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ, పెనుగొండలో వాసవీ మాత, విశేషాలంకరణలో పెదవేగి మండలం రాట్నాలకుంట రాట్నాలమ్మ, కాళ్ల మండలం కోపల్లెలో ధనలక్ష్మి అలంకరణలో అమ్మవారు, వనదుర్గగా దర్శనమిచ్చిన తాడేపల్లిగూడెం బలుసులమ్మ

కల నెరవేరేలా..



ఏలూరు జిల్లా ప్రజలను ప్రతీ చోట రైల్వే ట్రాఫిక్ కష్టాలు దశాబ్దాల తరబడి తీవ్రంగా బాధిస్తున్నాయి. కోట్లాది వ్యయంతో ఇవి ఏర్పాటు చేయాలంటే కేంద్రం నిధులే ఆధారం. 2029 నాటికి రైల్వే లెవెల్ క్రాసింగ్ లు లేని దేశంగా అభివృద్ధి చేయడానికి కేంద్రం సుముఖంగా ఉంది. దీంతో జిల్లాలో పలుచోట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిల ఏర్పాట్లకు త్వరలో మోక్షం కలగనుంది. జిల్లాలో రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్ల సమస్యలపై పలుమార్లు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ పార్లమెంట్‌లో చర్చించడం, వాటిపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ని కలవడంతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అవుతోంది.

- ఏలూరు ఎంపీ మహేశ్ చొరవతో 14 చోట్ల ఆర్వోబీలకు గ్రీన్‌సిగ్నల్
- ఆరుచోట్ల అభివృద్ధికి టెండర్లకు సమాయత్తం
- నిధులు మంజూరు జరిగితే పనులు ముందుకు..

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

దశాబ్దాల కాలంగా పలు నియోజకవర్గాల్లోని కీలకమైన గ్రామాలు, పట్టణాలు, జాతీయ రహ దారుల సమీపంలో రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. కొన్నిసార్లు ఈ క్రాసింగ్‌లను దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రైల్వేశాఖలో సంస్కరణల ఫలితంగా 2029 నాటికి దేశంలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద గేట్లు వేసి ట్రాఫిక్ నిలువరించే పరిస్థితి లేకుండా ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి), అర్‌యూబీ (రైల్వే అండర్‌బ్రిడ్జి)ల నిర్మాణాలు చేపట్టేందుకు కేంద్రం సముఖంగా ఉంది. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో 16 రైల్వే ఓవర్ బ్రిడ్జిలను నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. మరోవైపు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను పలుమార్లు కలిపి ప్రతిపాదనలు చేయడం, నిధుల మంజూరుకు చొరవ తీసుకోవడంతో జిల్లాలో రూ.1100 కోట్లతో 14 రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ఇటీవలే గ్రీన్‌సిగ్నల్ లభించింది. గతంలో కేంద్రం 60 శాతం భరిస్తే, రాష్ట్రాలు 40 శాతం భరించి రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మా ణం చేపట్టేవారు. దీనికి ప్రభుత్వం చరమగీతం పాడింది. పూర్తిగా కేంద్రం నిధులతోనే వీటి నిర్మాణం చేపట్టనున్నారు.

మంజూరైన ఆర్వోబీలు ఇవే..

జిల్లాలో ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, కైకలూరు నియోజకవర్గాల్లోనే లెవెల్ క్రాసింగ్‌లు బెడద తీవ్రంగా ఉండడంతో ప్రతిపాదనలు అన్నింటికి పంపారు. ప్రధానంగా 14 ఆర్వోబీలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా ఇందులో ఏలూరు నగరం మధ్యలో ఉన్న పవర్‌పేట (34.7), ఆశ్రం సమీపంలో మార్కెట్ యార్డు లెవెల్ క్రాసింగ్ (351) వద్ద ఆర్వోబీలకు త్వరలో మోక్షం లభించనుంది. భీమడోలు (366 లెవెల్ క్రాసింగ్), కైకరం(364), ఉంగుటూరు(361), సీతంపేట(355), పూళ్ల(363), ఆటపాక (83ఈ), ఓటర్లపాడు (86ఈ), పల్లెవాడ(91ఈ), పంగిడి గూడెం(354), కొక్కిరపాడు(340), చేబ్రోలు (365), బాదంపూడి(369) ఉన్నాయి.

రూ.100 కోట్లతో పనులు

జిల్లా చాలా కాలంగా ఆర్వోబీల నిర్మాణాలకు ఎదురు చూస్తున్న వాటిల్లో ఆరింటికి త్వరలో టెండర్లు పిలవనున్నారు. ప్రధానంగా భూసేకరణ, ఇతర నిర్మాణాలను కలుపుకుని రూ.75 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు వ్యయంతో ఒక్కొక్క ఆర్వోబీ పనులు చేపట్టనున్నారు. భీమడోలు, కైకరం, ఉంగుటూరు, పవర్‌పేట, సీతంపేట, పూళ్ల రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ఆర్వోబీల నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలవనున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. మిగతావి డీపీఆర్‌లకు సిద్ధం చేశారు.



ఉంగుటూరు రైల్వే క్రాసింగ్ వద్ద పరిశీలన చేస్తున్న ఎంపీ పుట్టా, ఎమ్మెల్యే ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని (ఫైల్)

కనీస వేతనాల సలహామండలి డైరెక్టర్‌గా పుల్లయ్య

ఏలూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ గా ఉంగుటూరు నియోజకవర్గానికి చెందిన దూసనపూడి పుల్లయ్య (టీడీపీ) నియమి తులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వు లు జారీ చేసింది. పుల్లయ్య నియామకంపై పలువురు టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శివమణి

రైతుల సంక్షేమమే సొసైటీ లక్ష్యం

పెదవేగి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సొసైటీ కృషి చేస్తుందని సొసైటీ చైర్మన్ కొనకళ్ల శివమణి అన్నారు. మంగళవారం జరిగిన పెదవేగి మండలం ముండూరు సొసైటీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సహకారంతో రైతుల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ఖరీఫ్‌సాగులో అవసరమైన ఎరువులను రైతులకు అందించామని, వచ్చే రబీ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ఎరువులను అందుబాటులో ఉంచుతామన్నారు. తాళ్ల గోకవరం సర్పంచ్ నెక్కలపూడి సురేష్ బాబు, త్రిసభ్య కమిటీ సభ్యులు వెలివల నాగరాజు, బట్టు రాజారావు, కార్యదర్శి బీవీఎస్వీ ప్రసాదరావు, రైతులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

నూజివీడు టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు నూజివీడు విక్టోరియా టౌన్‌హాల్ క్రీడాకారులు ఎంపికైనట్లు వీటీ హెచ్ కోచ్ వాకా నాగరాజు తెలిపారు. చిత్తూరులో మే నెలలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ పోటీల్లో తృతీయ స్థానం సాధించిన కృష్ణాజిల్లా జట్టులో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఎంపీఎస్ కావ్యశ్రీ, డి.ఇందు ప్రియ అక్టోబరు 4 నుంచి డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

తమిళనాడు ప్రభుత్వ వైఫల్యం వల్లే తొక్కిసలాట

ఏలూరు ఎంపీ పుట్టా



బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ

ఏలూరు టూ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో టీవీకే పార్టీ, తమిళనాడు ప్రభుత్వం వైఫల్యం కారణంగానే ర్యాలీలో తొక్కిసలాట జరిగినట్టు స్పష్టంగా కనిపిస్తోందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొక్కిసలాట జరిగిన ప్రదేశాన్ని సోమవారం ఎన్డీఏ ఎంపీల బృందం పరిశీలించింది. బృందంలో సభ్యుడైన పుట్టా మాట్లాడుతూ బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శించినప్పుడు ఎంతో ఆవేదన కలిగిందన్నారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు, కొత్తగా పెళ్లైన జంటలు ఉండటం మనసును కలచివేసిందన్నారు. బృంద కన్వీనర్ హేమామాలినితోపాటు సభ్యులంతా కలిసి నివేదిక తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

ప్రతి ఇంటికి జీఎస్టీ ఫలాలే లక్ష్యం : పితాని



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పితాని

పెనుమంట్ర, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ఫలాలు ప్రతి ఇంటికి అందించాలన్నదే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశమని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం పెనుమంట్ర మండలం ఆలమూరులో రూ.20 లక్షలతో నిర్మించిన వెలమ, శెట్టిబలజ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డబుల్ ఇంజన్ సర్కార్ వేగంగా అభివృద్ధి సంక్షేమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. దైనందన జీవితంలో కొనుగోలు చేసే వస్తువులపై జీఎస్టీని కొంత తగ్గించడం కొన్నింటిలో పూర్తిగా తొలగించారని దీని కారణంగా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. శెట్టిబలిజ రామాలయంలో ఎమ్మెల్యే పితాని, జడ్పీ చైర్మన్ పద్మశ్రీ పూజలు నిర్వహించారు. సర్పంచ్ మేడపరెడ్డి వెంకటరమణ, ఎంపీటీసీ పలివెల ఆశాలత ప్రేమ్‌కుమార్, కడలి ఏడుకొండలు, ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రెజిల్ బృందం ప్రకృతి సేద్య క్షేత్ర సందర్శన

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏపీ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ(ఏపీసీఎన్ఎఫ్) నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను పరిశీలించేందుకు బ్రెజిల్, శ్రీలంక, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన 30 మంది సభ్యుల బృందం బుధవారం నుంచి పది రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనుంది. ప్రకృతి వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలు, గ్రామీణ సమూహాల చైతన్య ప్రక్రియను ఈ బృందం అధ్యయనం చేయనుంది. ఆగ్రో ఎకాలజీ నమూనాలను ప్రత్యక్షంగా పరిశీలించనుంది. తూర్పుగోదావరి, గుంటూరు జిల్లాల్లో క్షేత్ర సందర్శనలు చేయనుంది. ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నట్లు రైతు సాధికార సంస్థ మంగళవారం తెలిపింది.



బెల్లపు ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

సారా బట్టీలపై దాడులు..

9 మంది అరెస్టు.. 27 లీటర్ల సారా ధ్వంసం

ఏలూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):వరుస పండుగల నేపథ్యంలో సారా కాస్తారన్న సమాచారంతోను, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాలతో ఏలూరు జిల్లాలో పలు చోట్ల ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది మంగళవారం విస్తృత దాడులు నిర్వహించారు. ప్రత్యేక ప్రణాళికతో డిప్యూటీ కమిషనర్ బి. శ్రీలత సూచనలతో చింతలపూడి, టి. నర్సాపురం, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు, కుక్కునూరు మండలాల్లోని సారా ప్రభావిత గ్రామాలైన నాగిరెడ్డిగూడెం, నామవరం, ప్రగడవరం, తల్లారపల్లి, రేచర్ల, ఎర్రగుంటపల్లి, సీతానగరం, కృష్ణాపురం, బంధంచర్ల, మద్యాహ్నపువారిగూడెం, వెలగపాడు, పోతనపల్లి తండా తదితర ప్రాంతాల్లో దాడులు చేసి 9 మందిని అరెస్టు చేసి 27 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 750 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా విక్రయించినా తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య హెచ్చరించారు. అసిస్టెంట్ సూపరింటెం డెంట్లు అజయ్‌కుమార్ సింగ్, పాండురంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పెదపాడు, సెప్టెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): కంటి వ్యాధు ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టరు హేమలత అన్నారు. కొత్తూరులో రవికిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మధుమేహ రోగులు కంటి సమస్యలను అశ్రద్ధ చేయవద్దని డాక్టర్ హేమలత అవగాహన కల్పించారు. కొత్తూరు చినబాబు, దన్నె శేష గిరి, దన్నె ఆశోక్, సీహెచ్ దుర్గారావు, సీహెచ్ శ్రీనివాసరావు, తోలం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని పెదవేగి మండలం రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మవారికి నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.సతీశ్ కుమార్ తెలిపారు. లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చనలతో శ్రీరాట్నాలమ్మవారిని అర్చిస్తున్నామని ఆలయ అర్చకుడు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణ శర్మ చెప్పారు. నవరాత్రుల సమయంలో అమ్మవారిని దర్శించుకోవడం మంచిదని ఆయన తెలిపారు.


పవర్ పేట శ్రీకాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక అలంకరణలో మహాదుర్గాదేవి

దసరా జోష్... మార్కెట్ కిటకిట

ఏలూరు రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ వచ్చేసింది.. మరో ఇరవై రోజుల్లో దీపావళి పండుగ ఉంది. దీంతో జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రజలు జోరుగా పండుగ షాపింగ్ చేస్తున్నారు. వస్త్రాలు, బంగారం, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్ దుకాణాలు, వాహనాలు షోరూమ్‌లు కిటకిటలాడుతున్నాయి. పలు వ్యాపార సంస్థలు వివిధ రకాల ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. దసరాకు తోడు పెళ్ళిళ్ళ సీజన్ జత కావడంతో ఊహించిన దానికంటే అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయని వస్త్ర వ్యాపారులు పేర్కొంటున్నారు. బంగారం విక్ర యాలు జోరుగా సాగుతున్నాయి. పలు జ్యూవెలరీ సంస్థలు భారీ ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. దసరా - దీపావళి పండుగల సీజన్లో ఆటో మొబైల్ మార్కెట్ దూసుకుపోతోందని డీలర్లు చెబుతున్నారు. ప్రస్తుత మార్కెట్ ట్రెండ్ చూస్తుంటే ఈ సీజన్లో అమ్మకాలు భారీగా జరిగే అవకాశాలున్నాయని విశ్లేషిస్తున్నారు.


ఏలూరులోని వస్త్రదుకాణంలో కొనుగోలుదారుల సందడి

అభయాంజనేయస్వామి సన్నిధిలో అన్నదానం

పెదపాడు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయస్వామి దేవాయంలో దాత కన్నికంటి శ్రీనివాసరావు, మాధవి దంపతుల ఆర్థికసహకారంతో సుమారు 300 మందికి అన్నదానం నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని కుంకుమ, తమలపాకుల పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవాలయం వద్ద భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లుగా ఆలయ ఇవో పి.తారకేశ్వరరావు తెలిపారు. దేవాలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరల తగ్గింపుపై
ఎంపీడీవో అవగాహన

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): తగ్గిన జీఎస్టీ ధరలతో మహిళా సాధికారతకు బాటలు పడుతున్నాయని ఎంపీడీవో పీవీవీ ప్రకాశ్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల నుంచి భారీ వాహనాల వరకూ అన్నింటిపై జీఎస్టీ తగ్గించిందన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ఉపాధి ఉద్యోగులు, శ్రామికులు, వెలుగు సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఏప వస్తువులపై దేశ వ్యాప్తంగా జీఎస్టీ అమలు ఉందనే అంశాన్ని ఆయన తెలియజేశారు. నిత్యావసర వస్తువులతో పాటు, కూరగాయలు, పాలు, ఎలక్ట్రానిక్ వస్తువులపై ధరలు తగ్గాయన్నారు. ప్రజలు తగ్గిన ధరలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. తహసీల్దారు జె.వి. సుబ్బారావు, ఎంఈవో వెంకట్రావు, హెచ్‌వో అమర్నాథ్, ఉపాధిహామీ ఏపీవో బి.నాగరాజు పాల్గొన్నారు.

అమ్మా.. దీవించు

- దుర్గాదేవిగా భక్తులకు అమ్మవారు దర్శనం
- పలు చోట్ల ఘనంగా అన్న సమారాధనలు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):నగరంలోని పలు డివిజన్లలోని అమ్మవారి ఆలయాల వద్ద జరుగుతున్న దేవీ నవరాత్రుల్లో భాగంగా మంగళవారం దుర్గాష్టమి కావడంతో అమ్మవారికి దుర్గాదేవిగా అలంకరించి భక్తజనానికి దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తి శ్రద్ధలతో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని భక్తి సంకీర్తనలు ఆలపించి భజనలు నిర్వహించారు. సామూహిక పారాయణలు, హోమాలు జరిపారు. ఈ మేరకు అంబికాదేవి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ తొలుత పంచామృతాభిషేకం జరిపి అనంతరం దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. సత్రంపాడులోని స్వయంభూ సౌభాగ్యలక్ష్మీ దేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి దేవీ నవరాత్రుల్లో భాగంగా మంగళవారం దుర్గాదేవిగా అలంకరించి ఆలయ అర్చకులు ఊటుకూరి నాగేశ్వర శర్మ, సాయిబాబా శర్మలు భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలతో సామూహికంగా యాజ్ఞిక బ్రహ్మ అయాచితుల హరిచరణ్ శర్మ కుంకుమ పూజలు జరిపించి దుర్గాష్టమి అర్చనలు జరిపించి పారాయణలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కడవకొల్లు వెంకటేశ్వరరావు (చిన్నబాబు), అధ్యక్షులు కె.జీ.ఎన్.వి. గోపాలకృష్ణ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పిల్లి సావిత్రమ్మ, కె.నాగభూషణం, జీ.ఎస్.ఎన్.కె. శ్రీనివాసరావు మిత్రబృందం భక్తులకు భారీ ఏర్పాట్లు చేశారు. పత్తేబాదలోని శ్రీ కనకదుర్గమ్మను మంగళవారం దుర్గాదేవిగా అలంకరించి అర్చకులు ప్రయాగ వెంకట్రామమ్మూర్తి భక్తజనంతో కుంకుమార్చనలు జరిపించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ పృధ్వి సత్యనారాయణమూర్తి, ఈవో నల్లూరి సతీశ్ కుమార్, ఇన్‌చార్జి బాబి, మిత్రబృందం భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు. బావిశెట్టివారిపేటలోని కనకదుర్గాంబను అలంకరించి ఆలయార్చకులు యడవల్లి శ్రీహరిశర్మ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో సి.హెచ్. చిననాగేశ్వరరావు తగు ఏర్పాట్లు చేశారు. మహిళలతో కోటి కుంకుమార్చన జరిపించారు. దక్షిణపు వీధిలోని మహిషాసురమర్ధిని, బాలా త్రిపుర సుందరీదేవి, అగ్రహారంలోని కన్యకాపరమేశ్వరి, జ్ఞాన సరస్వతి, పవరుపేటలోని కాశీ అన్నపూర్ణాదేవి, లక్ష్మీదేవి, పత్తేబాద లోని కనక దుర్గమ్మ, తదితర ఆలయాల్లో దుర్గాష్టమి పూజలు విరివిగా జరిగాయి. దేవాలయాలన్నీ భక్తజనంతో కిటకిటలాడాయి. ఆలయాలన్నీ దుర్గాదేవి అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి.

ప్రశాంత్ నగర్‌లో అన్న సమారాధన

ఏలూరురూరల్: దసరా మహోత్సవాలు పురస్కరించుకుని మంగళవారం దక్షిణపు వీధి ప్రశాంత్ నగర్‌లో ఉన్న కనకదుర్గమ్మ ఆలయం వద్ద వల్లూరు రమేశ్ ఆధ్వర్యంలో మహా అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జనసేన నాయకులు నారా శేషు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.


శ్రీదేవిభూదేవి సన్నిధిలో ఎమ్మెల్యే బడేటి చంటి

దుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా పవర్‌పేటలో ఉన్న శ్రీదేవిభూదేవి సమేత వాసుదేవాలయంలో ఎమ్మెల్యే బడేటి చంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ గోపాల్, టీడీపీ నేతలు శ్రీనివాస్, ఎస్.శ్రీనివాస్, ఇడా చైర్మన్ శివప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

దుర్గాదేవిగా అమ్మవారు దర్శనం

పెదపాడు: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెదపాడు, రామచంద్రపురం, తెలగాలపేట, కొత్తూరు, అప్పనవీడు, గుడిపాడు తదితర గ్రామాల్లో దసరా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి దుర్గాదేవిగా మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా చోట్ల పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. రామచంద్రపురంలో రామాలయం యూత్ కమిటీ ఆధ్వర్యంలో భవానీలు అమ్మవారి భజనలు నిర్వహించారు.

వర్గీకరణతో దళితుల ఐక్యతపై కుట్ర


విలేకరులతో మాట్లాడుతున్న ఆర్ఎస్ రత్నాకర్

ఏలూరు రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకే ఎస్సీ వర్గీకరణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చినట్టు మాల మహానాడు అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.రత్నాకర్ ఆరోపించారు. ఆయన మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్గీకరణ కోసం మోదీ, చంద్రబాబు, రేవంత్ రెడ్డి కుట్ర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా మాలలు ఐక్యంగా పోరాటాలు చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టాలు అయిపోయాయని భావించకుండా పోరాడాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాలసామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తొక్కేస్తామంటే మాల ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు.


భవానీలకు భోజనాలు వడ్డిస్తున్న దాతలు

భవానీ భక్తులకు అల్పాహారం

దెందులూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ దర్శనానికి తరలివెళ్తున్న భవానీ మాలదారులకు 16వ నెంబర్ జాతీయ రహదారిపై గుండుగోలను(సింగవరం) వద్ద భోజనాలు, అల్పాహారం, పండ్లు, గ్లూకోజ్‌లను అందజేశారు. ఆ గ్రామానికి చెందిన ఇందుకూరి లక్ష్మీపతి రాజు, సోమన్ వెంకట్రావు, ఇందుకూరి రాము ఆధ్వర్యంలో భవానీ మాలధారులకు క్షత్రియ రాజుల సంఘం ఆధ్వర్యంలో ఈ ఏర్పాట్లు చేశారు. దాట్ల సీతారామ రాజు, శ్రీనివాసరావు రాజు, పట్నాల ప్రసాద్‌బాబు ఉన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట : ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినాటి నుంచి ఇప్పటి వరకు రూ.3కోట్ల 31లక్షలు విలువైన వైద్యాన్ని పేదలకు అందించామన్నారు. మంగళవారం 11మందికి రూ.10లక్షల 37వేల విలువైన చెక్కులు పంపిణీ చేశామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 283 మందికి వైద్యం అందించామన్నారు. ఇడా చైర్మన్ శివప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, టీడీపీనేతలు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంటి

నేడు జీఎస్టీపై అవగాహన

దెందులూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమాన్ని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించను న్నారు.గోపన్నపాలెంలోని శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో ఏపీ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్(ఐఎఎస్) ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వీలతో కలిసి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో జరగనుంది. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గారపాటి రామసీత, మండల అధ్యక్షుడు మిల్లుబాబుతో పాటు సహకార సంఘం బ్యాంకు అధ్యక్షులు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు పాల్గొనున్నారు.

6, 7న ఏజెన్సీలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన

బుట్టాయగూడెం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోతు హుస్సేన్ ఆక్టోబరు 6, 7 తేదీల్లో పశ్చిమ ఏజెన్సీలో పర్యటించనున్నారు. ఈ మేరకు టూర్ షెడ్యూల్ అధికారు లకు అందింది. అక్టోబరు 5న రాజమహేంద్రవరం చేరుకుంటారు. 6న బుట్టాయగూడెం, దొరమామిడి, అలివేరు గ్రామాలతో పాటు బుట్టాయగూడెం-వేలేరుపాడు మండలాల సరిహద్దులో ఉన్న మోదేలు గ్రామంలోని కొండ రెడ్ల సమస్యలు తెలుసుకుంటారు. 7న ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

చిత్రజ్యోతి
SINCE 1965

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

సవాళ్లకు సిద్ధమే



సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగిమణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.

రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.

అయ్యో.. పాపం!



- ఏలూరులో ముళ్ల పొదల్లో పడి ఉన్న బాలిక
- స్థానికుల సమాచారం.. రక్షించిన పోలీసులు
- మానసిక దివ్యాంగురాలిగా గుర్తింపు
- సమీపంలోని ఆశ్రం ఆసుపత్రికి తరలింపు



పొదల నుంచి బాలికను వెలికి తెస్తున్న డీఎస్పీ, సిబ్బంది, ఆస్పత్రిలో బాలిక

ఏలూరు క్రైం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నోటిలో వేలు పెట్టుకుని ఊఊ అంటూ బిత్తర చూపులు చూస్తున్న బాలిక పరిస్థితి చూస్తే హృదయం ద్రవించిపోతుంది. ఏ తల్లికి జన్మించిన బిడ్డో.. పుట్టుకతోనే మానసిక, శారీరక వైకల్యం ఆ పాపకు శాపంగా మారింది. సుమారు ఐదేళ్ల బాలిక తుప్పల్లో ముళ్ల పొదల మధ్య పడి ఉంది. ఏలూరు ఆశ్రం ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారి పక్కన పొదల్లో బాలిక పడిఉన్న సంఘటన కలకలం రేపింది.

ఆశ్రం ఆసుపత్రి రైల్వే బ్రిడ్జి దాటిన తరువాత రహదారి పక్కన ముళ్ల పొదల్లో మంగళవారం సాయంత్రం ఒక బాలిక మూలుగుతున్నట్లు స్థానికులు గమనించారు. దగ్గరగా వెళ్లి పరిశీలించి ఒక్కసారిగా అవాక్కయ్యారు. సుమారు 5 ఏళ్ల బాలిక ముళ్లపొదల్లో నోటిలో వేలుపెట్టుకుని మూలుగుతుంది. ఈ సమాచారం స్పెషల్ బ్రాంచ్ సీఐ మల్లేశ్వరరావుకు అందడంతో ఆయన వెంటనే ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, సీఐ రాజశేఖర్, దెందులూరు ఎస్ఐ, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలిక మానసిక, శారీరక దివ్యాంగురాలిగా గుర్తించారు. సమీపంలోని ఆశ్రం ఆసుపత్రికి తరలించడంతో వైద్య సేవలు అందిస్తున్నారు. సోమవారం సాయంత్రం నుంచే బాలిక మూలుగు వినపడినట్లు అక్కడి కార్మికులు చెబుతున్నారు. డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ సమాచారం అందిన వెంటనే బాలికను సంరక్షించామని తెలిపారు. ఎవరు తీసుకువచ్చి అక్కడ వదిలిపెట్టారు? కారణాలు ఏమిటి? బాలిక ఎవరు? అనే అంశాలపై దర్యాప్తు చేపట్టామన్నారు. బాలిక వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బాలిక సంరక్షణ కోసం ఐసీడీఎస్ అధికారులకు తెలియజేశామన్నారు.

వ్యవసాయ కూలీపై యువకుల దాడి

కామవరపుకోట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రావికంపాడు పంచాయతీలోని నులకానివారిగూడెం సమీపంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న కట్టా నాగమ్మ(50)పై మంగళవారం ఇద్దరు వ్యక్తులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను 108 వాహనంపై జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రావికంపాడు పంచాయ తీలోని పాత వెంకటాపురం నుంచి నులకానివారిగూడెం దారి నేపథ్యంలో దాడి చేసినట్లు సమాచారం. తనపై శ్రీను, లక్ష్మణ్ దాడి చేశారని నాగమ్మ పోలీసులకు తెలిపింది.

బహిరంగ సభలు, ర్యాలీలు నియంత్రించాలి

పాలకొల్లు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): బహిరంగ సభలు, ర్యాలీలు, సినిమా ప్రమోషన్ కార్యక్రమాలతో అమాయక ప్రజలు బలైపోతున్నారని, వాటిని ప్రభుత్వాలు నియంత్రించాలని మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య అన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సభలు సమావేశాలు, ర్యాలీలలో ఏమైనా ఘటనలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బహిరంగ సభలు, ర్యాలీలు, సినిమాల ప్రమోషన్స్ కార్యక్రమాల నిర్వహణపై ఘాటైన విమర్శలు చేశారు.

వృద్ధాప్యం వరమే..



ఇంటిల్లిపాది అభ్యున్నతికి జీవితమంతా కష్టపడిన వ్యక్తి ఇప్పుడు ఒక మూల చిన్న గదికి పరిమితమయ్యాడు. ఒక పట్టె మంచం.. ఒక కంచం.. ఒక గ్లాసు.. నెమ్మదిగా తిరిగే ఒక ఫ్యాన్.. అనేక మంది వృద్ధుల జీవన శైలి ఇది. పాత తరంపై కొత్త తరానికి మమకారం పెరగాలి. అప్పుడు వారికి ఆయుర్దాయం పెరుగుతుంది. పిల్లల ప్రేమతో వృద్ధాప్యం వరంగా మారుతుంది. తొలుత 1991 అక్టోబరు 1న ప్రపంచ వ్యాప్తంగా వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం

వృద్ధులైన తల్లిదండ్రులకు పిల్లలే కొండంత అండ

ఆప్యాయతతో మరింత ఆయుర్దాయం

పాలకొల్లు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు 60 ఏళ్ల వయసు అంటే వృద్ధాప్యం. ఇప్పుడు మనిషి సగటు ఆయురార్థం పెరిగింది. 65 పైబడి వయసులో పౌరులు ఆనందంగా జీవించాలంటే వారిని పిల్లలు ఆప్యాయంగా చూడాలి. బాల్యంలో పిల్లలు తల్లిదండ్రులను విడిచి ఉండలేరో. 60 ఏళ్లు పైబడిన తల్లిదండ్రులు కూడా పిల్లల ఆసరా లేకుండా ఉండలేరు. ప్రస్తుత యాంత్రిక జీవనంలో తల్లిదండ్రులకు పిల్లల ఆసరా కరువైంది. డబ్ల్యుహెచ్‌వో జరిపిన సర్వేలో అధిక శాతం వృద్ధులు అనేక శారీరక, మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు వెల్లడైంది. పూర్తి ఆరోగ్యంతో గడుపుతున్న వారి సంఖ్య సుమారు 20శాతం ఉండగా మానసిక ఒత్తిడితో 15 శాతం, అనారోగ్య సమస్యలతో 20 శాతం, బిడ్డల సంరక్షణ కరువై 15 శాతం మంది, కాయకష్టం చేసుకుని వృద్ధాశ్రమంలో జీవిస్తున్న వారి సంఖ్య 30శాతం ఉంది.

వెన్నాడే ప్రాణభయం..

సహజంగా వృద్ధాప్యంలో ఎక్కువ మందిని ప్రాణభయం వెంటాడుతుంది. 60 ఏళ్ల వయసులో ధైర్యంగా ఉన్నా 70 ఏళ్ల వయస్సు వచ్చే సరికి ప్రాణభయం పెరుగుతున్నది. పట్టణవాసం, నగరీకరణ నేపథ్యంలో ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోతున్నాయి. సెల్‌ఫోన్‌లతో పెద్దలతో ఆప్యాయంగా మాట్లాడే వారే లేరు. వృద్ధులను ఆప్యాయంగా చూసుకుంటే ఆయుర్దాయం పెరుగుతుందని వివిధ సర్వేలు చెబుతున్నాయి.

వృద్ధాప్యంలో కొంత చాదస్తం

పిల్లలకు బాధ్యతలు అప్పగించిన పెద్దలలో అనేక మంది చాదస్తంతో ఇబ్బందులు కొనితెచ్చుకుంటున్నారు. పిల్లల అవసరాలలో వృద్ధుల అనవసర జోక్యంతో మనస్పర్థలు వస్తున్నాయి. వృద్ధాప్యంలో పిల్లల ధిక్కార స్వరం తట్టుకోలేకపోతున్నారు. వృద్ధులు చిన్నపిల్లల మనస్తత్వంతో ప్రవర్తిస్తున్నప్పటికీ యువత అర్థం చేసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. రోజులో కనీసం ఒక రెండు గంటలు ఇంటి వద్ద ఉండి తల్లిదండ్రులను ఆప్యాయంగా చూసుకుంటే వారి ఆఖరి దశ ఆరోగ్యంగా ముందుకు వెళ్తుందని నిపుణులు సలహా ఇస్తున్నారు.

నిద్ర దరిచేరదు..

సహజంగా ఏ వయసు వారికైనా చాలినంత నిద్ర దివ్య ఔషధం. వృద్ధులు రోజుకు 8గంటలకు తక్కువ కాకుండా నిద్రిస్తే ఆరోగ్యమని నిపుణులు సూచిస్తున్నారు. వృద్ధాప్యంలో వారి భయాలను పోగొట్టి అభయం ఇవ్వడం ద్వారా ధీమాగా ఉంటారని పరిశీలకులు చెబుతున్నారు.

ఉమ్మడి కుటుంబంతోనే ఆనందం



మా అమ్మ కొప్పరపు వెంకట సబ్బమ్మకు 94 ఏళ్ల వయసు. నేను చిరు వ్యాపారం చేసుకుంటున్నారు. భార్య పిల్లలు, తల్లితో కలిసి ఉంటున్నాం. భార్య, పిల్లలు కలుపుగోలుగా ఉండడంతో మా తల్లి సంతోషంగా ఉంది. మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ ఆమెను ఆప్యాయంగా చూసుకుంటున్నాం.

- కొప్పరపు సత్యనారాయణ, పాలకొల్లు

వృద్ధులను పిల్లలు ప్రేమగా చూడాలి



పిల్లలు ఎంత విసిగించినా తల్లిదండ్రులు ఓపిగ్గా ఉంటారు. తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నప్పుడు చాదస్తంతో పిల్లలను విసిగించినప్పటికీ అర్థం చేసుకోవాలి. వారిని ఆప్యాయంగా చూసుకోవాలి. తల్లిదండ్రులను ప్రేమగా చూసుకుంటే సమాజంలో వృద్ధాశ్రమం అవసరమే ఉండదు.

- చేగొండి హరిరామజోగయ్య, మాజీ ఎంపీ

ఉమ్మడి కుటుంబం.. ఒకరికొకరు అండ

ఉమ్మడి కుటుంబంలో ఒకరికొకరు అండగా ఉంటారని యలమంచిలికి చెందిన మేకా శేషారావు చెబుతున్నారు. సమస్యలను కలిసి పరిష్కరించుకోవచ్చు, అన్నివేళల మనం అనే భావన ఉంటుందంటున్నారు. వృద్ధాప్యంలో ఉన్న వారికి ఎటువంటి చింత ఉండదని ఆయన అంటారు. శేషారావు, సత్యవతి దంపతులకు ఇద్దరు కుమారులు, పెద్దకుమారుడు విశ్వేశ్వరరావు, చిట్టిబుల్లెమ్మ దంపతులతో పాటు వారి పిల్లలు, చిన్న కుమారుడు సీతారామాంజనేయులు అంతా కలిసే ఉంటున్నారు.



పిల్లలు, మనుమలతో మేకా శేషారావు దంపతులు

రక్తదానం ప్రాణదానం

నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం



- ప్రజలలో పెరిగిన చైతన్యం
- ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు
- అత్యవసరమైతే తక్షణ సాయం

ఆకివీడు రూరల్ సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రక్తదానం అంటే ప్రాణదానం చేయడమే. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, రక్తహీనత, తలసీమియా బాధితులకు రక్తం అవసరం. దాతలు రక్తంతో వేల ప్రాణాలు నిలబడుతున్నాయి. 1975లో ఇండియన్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్, ఇమ్యూనో హెమటాలజీ ఆధ్వర్యంలో డాక్టర్ జైగోపాల్‌జాలీ జన్మదినం సందర్భంగా అక్టోబరు 1న జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం నిర్వహిస్తారు.

రక్తదానంపై ప్రజలలో చైతన్యం వచ్చింది. బంధువులు, కుటుంబ సభ్యులే కాదు, స్నేహితులు రక్తదానం చేసేందుకు ముందుకు వస్తున్నారు. సినిమా హీరో అభిమానులు, రాజకీయ నేతల అనుచరులు ముందుకు వస్తున్నారు. కొంతమంది వాట్సాప్ గ్రూపులుగా రక్తదాన కార్యక్రమాలు చేస్తున్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే..

రక్తం దానం చేసేవారి వయసు, బరువు, బిపి, పల్స్, హిమోగ్లోబిన్ లెవెల్స్ నిబంధనలు ప్రకారం ఉండాలి. వయస్సు 18 నుంచి 65 ఏళ్ల మధ్య ఉండాలి, బరువు 45 నుంచి 50కిలోల మధ్య ఉండాలి, హిమోగ్లోబిన్ మహిళలలో 12 గ్రాములు, పురుషులలో 13 గ్రాములుండాలి, పల్స్‌రేట్ నిమిషానికి 50-100 మధ్య ఉండాలి, బీపీ 80-120మధ్యఉండాలి, శరీర ఉష్ణోగ్రత 37.5 ఉండాలని నిబంధనలు తెలియజేస్తున్నాయి.

రక్తం దానంతో లాభాలు

రక్తం దానం వలన మళ్లీ రక్తం ఉత్పత్తితో చురుకుదనం పెరుగుతుంది, గుండె సంబంధ రోగాల ప్రమాదం తగ్గుతుంది. రక్తదానం చేసిన తరువాత ఎర్ర రక్తకణాలు 4 నుంచి 6వారాలలో సాధారణ స్థాయికి చేరుకుంటాయి.

15 వేల మందికి రక్తదానం

అత్యవసర పరిస్థితులలో రక్తం అందించేందుకు నూకల శివ, అల్లాడి రవితేజ కొంతమంది స్నేహితులతో కలిసి మే 1, 2019లోహోప్ ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేశారు. రక్తదాతలను సమీకరించి వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాలలో ఎవరికి రక్తం అవసరమైనా వెళ్లి రక్త దానం చేస్తారు. ఈ గ్రూపులో 300కిపైగా సభ్యులు ఇప్పటి వరకు 15 వేల మందికి రక్తదానం చేశారు. నాలుగేళ్లుగా 40 మంది తలసీమియా బాధిత పిల్లలకు ఒక ప్రైవేటు బ్లడ్ బ్యాంకు సహకారంతో ప్రతి నెల రక్తం అందజేస్తున్నాం.

50 సార్లు రక్తమిచ్చా..



ఒక గర్భిణికి రక్తం అవసరమైతే 26 ఏళ్ల వయసున్న నన్ను అడిగారు. వెంటనే రక్తం అందజేశాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు 50 సార్లు పైగా రక్తదానం చేశాను. సంవత్సరానికి మూడుసార్లు తక్కువ కాకుండా రక్తదానం చేస్తాను.

- భూపతిరాజు శ్రీనివాసరాజు, మోగల్లు



● మహార్నవమి సందర్భంగా బుధవారం జిల్లాలోని ఆయా ఆలయాల్లో అమ్మ వార్లు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శన మిచ్చారు. ఏలూరు పన్నెండు పంపుల సెంటర్‌లో మహిషాసురమర్దిని అలంకరణ లోని అమ్మ వారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరిపారు.

విజయానికి ప్రతీక.. దసరా

నేడు విజయదశమి పండుగ

- మార్కెట్‌కు పండుగ శోభ
- పువ్వులు, పండ్లకు డిమాండ్
- ప్రత్యేక ఆఫర్లు ప్రకటించిన కంపెనీలు



ఏలూరు వన్‌టౌన్ పూలబజార్‌లో కొనుగోలుదారుల రద్దీ



ఏలూరుసిటీ/ఏలూరు రూరల్ అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి):నేడు విజయదశమి.. చెడుపై విజయానికి ప్రతీకగా జరుపుకునే విశేషమైన పండుగ. శరన్నవరాత్రుల్లో భాగంగా దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమిగా మూడు రోజులు దసరా పండుగను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. దశమి రోజున శమీ పూజ నిర్వహిస్తారు. ఈ రోజున అమ్మ వారు రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిస్తారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన దేవాలయాల్లో అమ్మ వారికి పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. విజయదశమి రోజున నూతన వ్యాపారాలను ప్రారంభించడం, నూతన వస్తువులు కొనుగోళ్లతో జిల్లాలో సందడి నెలకొంది.

మార్కెట్‌లో పండుగ రద్దీ

బుధవారం ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు మార్కెట్‌లు కళకళలాడాయి. పూలు, పండ్లు, అరటి పిలకలు, మామిడాకులు, కొత్త దుస్తులు, సరుకులు కొనడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు ఏలూరు రావడంతో దీంతో వన్‌టౌన్, టూ టౌన్ మెయిన్‌బజార్‌లోని వ్యాపార సంస్థలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. మూర పూల ధర రూ.50 నుంచి రూ.70 వరకు పలికింది. విడిపువ్వులు పావు కేజీ రూ.50లకు అమ్మకాలు చేశారు. దసరా రోజునఆయా వృత్తుల వారు వాడే సాధనాలు, యంత్రాలు, పుస్తకాలు, వాహనాలకు పూజలు చేస్తారు. ఈ మేరకు పూజ కోసం ఎర్ర చున్నీ, కొబ్బరి కాయ, మామిడి ఆకులు, గంధం, పసుపు, అక్షింతలు, పువ్వులు, అగరబత్తులు, పండ్లు, స్వీట్లు వంటి అవసరమైన వస్తువులను కొనుగోలు చేశారు. అరటి, చెరకు ముక్కలు, పండ్లు, పువ్వులు తదితర పూజ సామగ్రి అమ్మకాలు జోరుగా సాగాయి. ఇక ఎలక్ట్రానిక్స్ వస్తువులు (ఫ్రిజ్, టీవీ, వాషింగ్ మిషన్లు, గ్రైండర్లు), మోటార్ సైకిళ్లు, వివిధ రకాల కార్లు అమ్మకాలు సాగుతున్నాయి. వస్త్ర దుకాణాల వద్ద మహిళల సందడి ఎక్కువగా కనిపించింది. మరోవైపు ప్రయాణికుల రాకపోకలతో ఏలూరు రైల్వేస్టేషన్, బస్టాండ్‌లు కిటకిటలాడాయి.

ఏలూరు రైల్వేస్టేషన్‌లో రద్దీ



కొవ్వొత్తులతో వైద్యుల ర్యాలీ

■ లోపలి పేజీలో..



వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న మంత్రి కొలుసు. చిత్రంలో కలెక్టర్ వెట్రిసెల్వి, తదితరులు

93.87 శాతం పింఛన్ల పంపిణీ

ఏలూరు సిటీ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):జిల్లాలో అక్టోబరు నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు బుధవారం పంపిణీ చేశారు. ఉదయం 7 గంటలకు జిల్లాలోని 605 సచివాలయాల పరిధిలో 5,175 మంది గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. జిల్లాలో 2,60,765 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా సాయంత్రం 6 గంటలకు 2,44,787 మందికి (93.87 శాతం) పంపిణీ చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు తెలిపారు. నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి మండలం అడవినెక్కలంలో మంత్రి కొలుసు పార్థసారథి, కలెక్టర్ వెట్రిసెల్వి, సబ్ కలెక్టర్ వినూత్న పింఛన్లను పంపిణీ చేశారు.



శ్రీవారి క్షేత్రానికి బ్రహ్మోత్సవ శోభ

- నేడు వరుడు కానున్న చినవెంకన్న

■ లోపలి పేజీలో..

వాతావరణంలో మార్పులు.. ఆక్వా రైతుల్లో ఆందోళన



రొయ్యల చెరువులో తిరుగుతున్న ఏరియేటర్లు

కలిదిండి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రోజులుగా చిరుజల్లులు పడుతుండడంతో చెరువుల్లో ఆక్సిజన్ లోపించే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. కలిదిండి మండలంలో సుమారు 33 వేల ఎకరాల్లో చేపలు, రొయ్యల సాగు చేస్తున్నారు. చేపలు పట్టుబడి దశలో ఉన్నాయి. చిరు జల్లులు పడుతుండడంతో రైతులకు కంటి మీద కునుకు ఉండడం లేదు. చెరువుల్లో బోట్లు, ఏరియేటర్లు తిప్పుతున్నారు. పలు గ్రామాల్లో చెరువుల్లో ఆక్సిజన్ లోపించడంతో పాటు వైరస్ సోకడంతో చిన్న సైజు రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. వీటిని రొయ్యల కంపెనీల యాజమాన్యాలు కొనుగోలు చేయకపోవడంతో ఆకివీడు, ఏలూరు మార్కెట్‌లో అయినకాడికి అమ్ముకుంటున్నారు. 'చేపల చెరువుల్లో ఆక్సిజన్ కొరత నివారణకు హైడ్రోజన్ పెరాక్సైడ్ ఎకరానికి కిలో చొప్పున పిచికారీ చేయాలి. చెరువుల్లో బోట్లు, ఏరియేటర్లు తిప్పాలి. మేతలు వీలైనంత తక్కువ వేయాలి' అని మత్స్యశాఖ అధికారి రవికుమార్ తెలిపారు.

వైసీపీ జిల్లా అధ్యక్షుడు దూలంపై కేసు

ఏలూరు క్రైం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):ఏలూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుపై ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు గన్‌బజార్‌లోని వైసీపీ కార్యాలయంలో గత నెల 26న మీడియా సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలీసులను అవమానించారని, కైకలూరు రూరల్ సీఐ వీర రవికుమార్‌పై లేనిపోని ఆరోపణలు చేసి పోలీసు ప్రతిష్ఠ దిగజార్చేలా మాట్లాడి వీడియోలు పెట్టారని, ఈ నేపథ్యంలో బహిరంగంగా పోలీసులకు క్షమాపణ చెప్పాలని ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండారు నాని, నాయకులు డిమాండ్ చేశారు. నాగేశ్వరరావు క్షమాపణ చెప్పకపోవడంతో పోలీసు అధికారుల సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండారు ఏసు అలియాస్ నాని ఏలూరు టూటౌన్ పోలీసులకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ కె.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే దూలంపై కేసు నమోదు చేశారు.

బాణసంచా తయారీ, విక్రయాలకు అనుమతి తప్పనిసరి : ఎస్పీ

ఏలూరు క్రైం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):దీపావళి బాణసంచా తయారీ కేంద్రాలు, షాపులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. దీపావళి సందర్భంగా గతంలో జరిగిన ఘటనలు దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. జిల్లాలో ఎవరైనా అనుమతి లేకుండా బాణసంచా, టపాసులను ఇళ్లల్లో, షాపుల్లో, జన సముదాయాల మధ్య, గొడౌన్లలో నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తయారు చేసే వారు, విక్రయించేవారు కచ్చితంగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. షాపుల్లో, తయారీ కేంద్రాల్లో కాని మైనర్లతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దీపావళి రోజు సాయంత్రం ఐదు గంటల తర్వాత ఎటువంటి అమ్మకాలు జరుపరాదన్నారు. ఎవరైనా అక్రమ బాణసంచా తయారీ, విక్రయాలు జరిపితే పోలీస్ కంట్రోల్ రూమ్ 83329 59175కు లేదా 112 కాని సమాచారం అందించాలని సూచించారు.

కలెక్టరేట్‌లో జీఎస్టీ హెల్ప్‌డెస్క్

ఏలూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏలూరు కలెక్టరేట్‌లో జీఎస్టీ హెల్ప్‌డెస్క్‌ను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఏర్పాటు చేశారు. మూడు షిఫ్టులు ఇద్దరేసి సిబ్బంది ఇక్కడ విధులను నిర్వహిస్తున్నారు. జీఎస్టీ శ్లాబ్‌ల తగ్గింపు వర్తింపులో ఏమైనా సందేహాలున్నా, ఉల్లంఘనలు జరిగినట్టు ప్రజలు దృష్టికి వస్తే 87126 31283 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

'మానవతా విలువలపై పిల్లలకు అవగాహన కల్పించాలి'

ఏలూరు క్రైం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):చిన్ననాటి నుంచి పిల్లలకు మానవతా విలువలు అవగాహన కల్పించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. ఏలూరులోని పట్టణ నిరాశ్రయుల వృద్ధుల ఆశ్రమాన్ని బుధవారం సందర్శించారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చట్టపరంగా వృద్ధులకు, సీనియర్ సిటిజన్స్‌కు ఉన్న హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. నేటి సమాజంలో నిరాశ్రయులైన వృద్ధుల సంఖ్య నానాటికి పెరుగుతోందన్నారు. వృద్ధులు వారి ఆస్తులను రక్షణలో కాని, వారి పిల్లల నుంచి భరణం పొందడంలో కానీ అవసరమైన న్యాయ సహాయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు ఉచితంగా అందిస్తుందన్నారు. ఉచిత న్యాయ సలహాలకు 15100 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు దసరా శుభాకాంక్షలు : ఎంపీ మహేశ్

ఏలూరు టూ టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడు పై మంచి సాధించిన విజయానికి దసరా పండుగ ప్రతీక అని అన్నారు. దసరా కానుకగా కేంద్రం జీఎస్టీ సంస్కరణలు చేసి ప్రజలపై భారాన్ని తగ్గిం చిందన్నారు. దుర్గమ్మ అమ్మవారి చూపులు ప్రజలందరిపై ఉండాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సూపర్ సిక్స్ హామీలు విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. అలాగే జీఎస్టీ తగ్గింపు అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు.

జీలకర్రగూడెంలో కనకదుర్గమ్మకు పూజలు

కామవరపుకోట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): గుంటుపల్లి పంచాయతీ జీలకర్రగూడెంలో బస్టాప్ సెంటర్ వద్ద దివాణం నిర్మించిన కనకదుర్గమ్మ ఆలయం వద్ద బుధవారం భక్తులు సామూహిక పూజలు నిర్వహించారు. అమ్మవారికి గులాబీ, కలువ పూలతో అర్చనలు జరిపారు. అమ్మవారికి మహిషాసురమర్దినిగా అలంకరించి గ్రామానికి చెందిన మారంపూడి సత్యనారాయణ దంపతులు పూజలు నిర్వహించారు. సభ్యులు ఎస్.ఆర్.ఆర్. చినరామకృష్ణంరాజు బృందం పూజలు జరిపారు. బీజేపీ ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు బాహుబలేంద్రుని బాలవర్ధిరాజు హాజరయ్యారు.



కలెక్టర్ వెట్రిసెల్వికి పుష్పగుచ్ఛం అందిస్తున్న శ్రీనివాస్, మహిళా ఉద్యోగినులు

ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ఏలూరు అర్బన్/ఏలూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ-సశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వశాఖల మహిళా ఉద్యోగులు, వారి కుటుంబాల్లోని మహిళలకు ఏలూరు కలెక్టరేట్‌లో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కలెక్టర్ వెట్రిసెల్వి పరీక్షలు చేయించుకున్నారు. తక్కువ రక్తపోటు, సాధారణ స్థాయిలోనే మధుమేహం ఉన్నట్లు తెలిసింది. సుమారు 350 మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించినట్టు డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు తెలిపాయి. వైద్య శిబిరం నిర్వహణను డీఎంహెచ్‌వో డాక్టర్ అమృతం, డీఐవో డాక్టర్ శోభ, ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్ సి.హెచ్.శ్రీనివాస్, సెక్రటరీ ఎన్.రామారావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్‌సతీశ్ పర్యవేక్షించారు.

ఆంధ్రా సరిహద్దు గ్రామాల్లో బతుకమ్మ సంబురాలు



జీలుగుమిల్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సరిహద్దు ఆంధ్రా ప్రాంతంలో బతుకమ్మ వేడుక ఘనంగా జరుపుకుంటున్నారు. తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా తెలంగాణ-ఆంధ్రా సరిహద్దు గ్రామాల్లో గత పది రోజులుగా తెలంగాణలో జరిపే బతుకమ్మ సంబురాలు ఇటు ఆంధ్రా సరిహద్దు గ్రామాల్లో సైతం మహిళలు ప్రత్యేక పూజలు చేసి సాంప్రదాయ గీతాలతో నృత్యాలు చేస్తున్నారు. జీలుగుమిల్లి శివారు సీఆర్ఆర్ కాలనీ, రాచన్నగూడెం గ్రామాల్లో బతుకమ్మలతో చివరి రోజు ఊరేగారు.

జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు సాత్విక ఎంపిక



ఏలూరు రూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): డెహ్రాడూన్‌లో ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి 50వ సబ్ - జూనియర్ బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు స్థానిక కస్తూరిబా పాఠశాల క్రీడాకారిణి ఎల్.సాత్విక ఎంపికైందని స్కూల్ హెచ్.ఎం. మాధవీలత తెలిపారు. సాత్విక ఇటీవల చిత్తూరులో జరిగిన రాష్ట్ర స్థాయి 10వ అంతర్ జిల్లాల సబ్ - జూనియర్ బాస్కెట్ బాల్ పోటీల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించి ఈ పోటీలకు ఎంపికైంది.

ఐదు రెవెన్యూ గ్రామాల్లో సర్వే ప్రారంభం

చింతలపూడి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నట్టు స్థానిక తహసీల్దార్ స్లీవజ్యోజి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 38 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఇప్పటి వరకు ఏడు రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యిందని, బుధవారం నుంచి నామవరం, పొనుకుమాడు, వెంకటాపురం, వెంకటాద్రిగూడెం, వెంకట్రాయపురం గ్రామాలలో గ్రామసభలు ప్రారంభించామని చెప్పారు. సర్వే జరిగే గ్రామాల్లో రైతులు సహకరించాలని కోరారు. మండలంలో స్మార్ట్ రేషన్ కార్డులు 2 వేల 500 ఉన్నాయని, పంపిణీ చేయగా మిగిలిన ఈ కార్డులను ఆయా ఏరియాల్లోని వీఆర్వో, రేషన్ డీలర్లను సంప్రదించి వాటిని తీసుకోవాలని సూచించారు.

● ఏలూరు రూరల్: రూరల్ మండలం మానూరులో ఈనెల 3న రైతులకు రీసర్వే ర్యాలీ, అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ జి.విజయ్ కుమార్‌రాజు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టులో భాగంగా ఈ సర్వే జరగనుందన్నారు. మండల సర్వేయర్, డిప్యూటీ తహసీల్దార్ నాగమణి, అన్ని గ్రామాల సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్వోలు సర్వేలో పాల్గొంటారని తెలిపారు.

● నిడమర్రు: సిద్ధాపురం, బైనేపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ నెల 3న ఉదయం 10 గంటలకు సిద్ధాపురంలో గ్రామసభ, మధ్యాహ్నం 3గంటలకు బైనేపల్లిలో గ్రామ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వయోవృద్ధులకు లయన్స్ ఘన సన్మానం

చింతలపూడి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): వయోవృద్ధుల దినోత్సవం స్థానిక లయన్స్ క్లబ్ ఆవరణలో జరిగింది. వివిధ రంగాల్లో సేవలందించిన పది మంది వయోవృద్ధులను శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. సన్మానం పొందిన వారిలో అడపా నాగేశ్వరరావు,పి.రామరాజు, పులిపాటి చక్రధరరావు, డాక్టర్ ఎ.సత్యనారాయణ, మద్దిపాటి వెంకట్రాయుడు, ఎం.డి.అక్బర్ అలీ, బండి విశ్వేశ్వరమూర్తి, రిటైర్డ్ డీజీపీ పూరేటి విజయానంద్, తోటచర్ల బాబూరావు, చిట్లూరి ధర్మరాజులకు శాలువాలు కప్పి సన్మానించారు. టి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్.ఎస్.ఎన్.గాంధీ, టి.రామారావులను సత్కరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, డి. రామకృష్ణ, చిల్లపల్లి రామ్మోహన్‌రావు, జి.చంద్రశేఖరరెడ్డి, సి.హెచ్.అబ్బయ్య, శివాజీ పాల్గొన్నారు.

స్త్రీ శక్తి పథకంతో మహిళలకు మేలు : మేఘలాదేవి



మహిళతో మాట్లాడుతున్న మేఘలాదేవి

కొయ్యలగూడెం, అక్టోబర్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలు ఎంతో అభివృద్ధి చెందుతారని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మేఘలాదేవి అన్నారు. బుధవారం ఆమె కొయ్యలగూడెం బస్‌స్టేషన్‌లో స్త్రీశక్తి పథకం గురించి మహిళలకు వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని అన్నారు. ఉచిత బస్సు పథకం మహిళలతో పాటు రోజువారీ వ్యాపారుల నిమిత్తం రాకపోకలు సాగించే వారి ఆర్థికాభివృద్ధికి ఉపకరిస్తుందన్నారు.

బహిరంగ వేలం ప్రకటన

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గ్రామ పంచాయతీ పరిధిలో ఈ క్రింది తెలిపిన చెరువులను ది. 03-10-2025 తేదీ అనగా శుక్రవారం ఉదయం గం.10:00 లకు నిమ్మలగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ పంచాయతీ సర్పంచ్ గారి అధ్యక్షతన జంగారెడ్డిగూడెం శ్రీ మండలం డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి సమక్షములో చేపల చెరువుల బహిరంగ వేలం వేయబడును. చెరువులను ది. 01-07-2025 నుండి 30-06-2028 వరకు అనగా 3 సంవత్సరముల కాల పరిమితికి చేపల ఫలసాయమునకు బహిరంగ వేలము నిర్వహించబడును. కావున పాటలో పాల్గొనదలచిన వారు పాట యొక్క షరతులు మరియు ఇతర వివరములకు గ్రామ పంచాయతీ కార్యాలయం పనివేళలలో సంప్రదించవలసినదిగా కోరడమైనది.

	చెరువు పేరు	పాట కాలపరిమితి 3 సంవత్సరాలు	చెల్లించ వలసిన ధరావత్తు	[illegible]	రిమార్క్స్
1	పెద్ద చెరువు	01-07-2025 నుండి 30-06-2028 వరకు	50,000/-	20,00,000/-	3 చెరువుల పాట నిర్వహించే ముందు సమర్పించాలి
2	అచ్చమ్మ చెరువు	01-07-2025 నుండి 30-06-2028 వరకు	10,000/-	3,00,000/-	
3	వెంకయ్య కుంట చెరువు	01-07-2025 నుండి 30-06-2028 వరకు	10,000/-	1,00,000/-	

పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ నిమ్మలగూడెం,జంగారెడ్డిగూడెం (మం), ఏలూరు జిల్లా.

జీఎస్టీ తగ్గింపు రైతులకు మేలు

» జిల్లావ్యాప్తంగా అవగాహన ర్యాలీలు



కొయ్యలగూడెంలో నిర్వహిస్తున్న ట్రాక్టర్ల ర్యాలీ

బుట్టాయగూడెం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడంతో పేదలకు వరమని ఏపీ ట్రైకార్ చైర్మన్, పోలవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు అన్నారు. బుధవారం బూసరాజుపల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నాయకులు పారేపల్లి రామారావు, శీలం వెంకటేశ్వరరావు, సుంకవల్లి సాయి, అమరవరపు అశోక్, ఎం.నాగేశ్వరరావు, బి.కృష్ణ, పారేపల్లి నరేష్, పెండ్యాల రమాదేవి, మడకం కన్నపరాజు, జారం చాందినీ విద్యాసాగరిక, ఆకుల రమణ పాల్గొన్నారు. అంతకముందు పైదావారిగూడెం, బూసరాజుపల్లి ప్రాంతాల్లో చైర్మన్ పింఛన్లు పంపిణీ చేశారు.

● టి.నర్సాపురం: రైతుకు చేయుత దేశప్రగతికి బాట అని మండల వ్యవసాయాధికారిణి ప్రియాంక తెలిపారు. టి.నర్సాపురం రైతు సేవా కేంద్రం పరిధిలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రియాంక మాట్లాడుతూ వ్యవసాయ యంత్ర పరికరాలపై జీఎస్టీ తగ్గించారని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. సొసైటీ చైర్మన్ జోనుబోయిన సోంబాబు, ఎంపీటీసీలు బాలయ్య, నాగపాటి వెంకటేశ్వరరావు, నాయకులు, పెద్దిన సత్యనారాయణ, అద్దంకి జగ్గారావు, ఏఈఓ గంగాధరరావు పాల్గొన్నారు.

● ఏలూరుటూటౌన్: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విధానంలో స్లాబ్‌లను తగ్గించి బ్లాక్ మార్కెట్ దందాకు తెర దించిందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ప్రజల్లో అవగాహన కోసం నగరంలో జీఎస్టీ స్లాబ్‌పై ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ రెండు స్లాబుల విధానం ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం, నడపన దానభాస్కరరావు, నడపన వాణి పాల్గొన్నారు.

● పోలవరం: రైతులు వ్యవసాయ యంత్రపరికరాలపై జీఎస్టీ రాయితీని వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు పిలుపునిచ్చారు. బుధవారం పోలవరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, తహసీల్దారు బి.సాయిరాజు, కొణతాల ప్రసాద్, గునపర్తి చిన్ని, బొడ్డు కృష్ణ, నునకాని రాంబాబు, కరిబండి నాగరాజు, బొరగం వెంకటలక్ష్మి, ఆటపాకల వెంకటేశ్ పాల్గొన్నారు.

● నిడమర్రు:జీఎస్టీ సంస్కరణలతో వ్యవసాయ యంత్రాలు, పనిముట్ల ధరలు చౌకగా లభిస్తున్నాయని నిడమర్రు మండల వ్యవసాయ శాఖాధికారిణి ఇంగర దైవ ఆశీర్వాదం అన్నారు. బుధవారం అడవికొలనులో అవగాహన కల్పించారు. సొసైటీ అధ్యక్షులు గోలి పుండరీకాక్షుడు, సొసైటీ త్రీమేన్ కమిటీ సభ్యులు సంకు శ్రీనివాసరావు, రెడ్డి మాధవరావు జనసేన మండల కన్వీనర్ నిమ్మల దొరబాబు, పైడికొండల శివాజీ పాల్గొన్నారు.

● భీమడోలు: వ్యవసాయశాఖలో ప్రభుత్వం జీఎస్టీ ద్వారా తగ్గించిన యంత్ర సామగ్రి ధరలు రైతులకు ఎంతో మేలు చేస్తాయని ఏఎంసీ చైర్మన్ శేషపుగిరి అన్నారు. భీమడోలులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కరణం పెద్దిరాజు, పుల్లయ్య, కె.ప్రసాద్, ఏవో ఉషారాణి పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: సూపర్ జీఎస్టీ ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయ శాఖాధికారి పోశారావు అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులు నాయకుల ఆధ్వర్యంలో ట్రాక్టర్‌తో ర్యాలీ నిర్వహించారు. జనసేన మండలాధ్యక్షుడు తోట రవి, బీజేపీ మండలాధ్యక్షుడు గొలిశెట్టి వాసు, టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి, ఎంపీడీవో కిరణ్ కుమార్, పట్టణ జనసేన అధ్యక్షుడు మాదేపల్లి శ్రీను, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బర చినరాజు, చోడిపిండి సుబ్రహ్మణ్యం, గొలిశెట్టి శ్రీను, కొడవటి రామకృష్ణ, గొలుసు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాత చింతలపూడిలో బోరు ప్రారంభం

చింతలపూడి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని పాత చింతలపూడిలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ బోరు వేయించి ప్రారంభించారు. దీంతో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని, రోడ్లు కూడా వేయాలని, డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు. తాగునీటి సమస్య పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ నాయకులు బోడా నాగభూషణం, టి.బాబు పాల్గొన్నారు.



దివ్యాంగురాలికి పింఛన్ అందిస్తున్న చింతమనేని



మహిళలకు పింఛన్లు ఇస్తున్న ఏలూరు ఎమ్మెల్యే చంటి, చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

ఇంటింటికీ వెళ్లి అందజేసిన ఎమ్మెల్యేలు

దెందులూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గోపన్నపాలెం, సోమవరప్పాడు గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బుధవారం స్వయంగా వెళ్లి అందించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్‌దారులకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్(మిల్లుబాబు), పార్టీ అధ్యక్షుడు చింతా సుబ్బారావు, మారగాని సత్యనారా యణ, కేబుల్ శ్రీను, బజారు గణేశు, బొర్రా చందు, భవాని ప్రసాద్, చమ్మక్ల మూడి రాము పాల్గొన్నారు.

● ఏలూరుటూటౌన్: ఇచ్చిన అధికారాన్ని బాధ్యతతో నిర్వర్తిస్తూ ప్రతినెలా సామాజిక పింఛన్ల పంపిణీని సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. బుధవారం పిరంగుల దిబ్బలో పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. శాంతి నగర్ 9వ రోడ్డులో ఎన్టీఆర్ సుజల వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, కమిషనర్ భానుప్రతాప్, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే రోషన్ కుమార్ పట్టణంలో ఏడవ వార్డులోని బాబూ జగ్జీవన్‌రామ్ నగర్, డాంగే నగర్ లోనూ పింఛన్ల పంపిణీ చేశారు. పట్టణంలోని అమ్మవార్ల మండపాలను ఎమ్మెల్యే దర్శించుకున్నారు. జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ,పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్,టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, టీడీపీ సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు, పెనుమర్తి రామకుమార్,రావూరి కృష్ణ, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, గుమ్మడి ప్రసాద్ పాల్గొన్నారు.

● పెదవేగి: పింఛన్ల పంపిణీతో ఎంతోమంది అభాగ్యుల జీవితాలకు భరోసా వచ్చిందని టీడీపీ పెదవేగి మండల అధ్యక్షుడు ఈడ్పుగంటి అనిల్ అన్నారు. ఒకటో తేదీ బుధవారం ఉదయం తెల్లవారుజాము నుంచి పింఛన్ల పంపిణీతో గ్రామ గ్రామాన లబ్ధిదారుల ఆనందాలతో పండుగ వాతావరణం వెల్లివిరిసింది. పెదవేగి మండలం కె. కన్నాపురంలో జరిగిన పింఛన్ల పంపిణీలో పాల్గొన్న టీడీపీ మండలాధ్యక్షుడు అనిల్ ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు పింఛన్లను అందించారు. మండలంలో పింఛన్లు 93శాతం పంపిణీ చేశామని ఎంపీడీవో రవికుమార్ తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం

పెదవేగి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యమని కొప్పాక సొసైటీ చైర్మన్ కొసరాజు వీరవెంకటవరప్రసాద్ అన్నారు. కొప్పాక సొసైటీ సర్వసభ్య సమావేశం సంఘాధ్యక్షుడు వరప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను అందిస్తున్నట్టు తెలిపారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సహకారంతో రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. సంఘం కార్యదర్శి చల్లగొళ్ల రమేశ్ బాబు సంఘ నివేదికను సభ ముందుంచారు. డైరెక్టర్లు పరసా వీరాస్వామి, గరికిముక్కు ఏసుపాదం పాల్గొన్నారు.



భవానీలకు పండ్లు పంపిణీ చేస్తున్న పోలీసులు

కలపర్రులో భవానీలకు అల్పాహారం

పెదపాడు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కె.శివప్రతాప్ శివకిశోర్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు యంత్రాంగం పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ వద్ద ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి కాలినడకన వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ వెళ్తున్న భవానీ మాలధారణ చేసిన భవానీలకు అల్పాహారం, మజ్జిగ, మంచినీళ్లను బుధవారం అందజేశారు. అదనపు అడ్మిన్ ఎన్.సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్‌లు మాట్లాడుతూ రోడ్డుపై కాలినడక వెళ్తున్న భక్తులు జాగ్రత్తగా ఉండాలన్నారు. పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్, డీటీ ఆర్బీ మధు పాల్గొన్నారు.

పుల్లయ్య నాయుడుకు గన్ని అభినందనలు

భీమడోలు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):కనీస వేతనాల సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్‌గా భీమడోలుకు చెందిన దూసనపూడి పుల్లయ్య నాయుడు ఎంపికయ్యారు. భీమడోలు శివారు వడ్లపట్ల గ్రామానికి చెందిన పుల్లయ్య టీడీపీ సీనియర్ నేత మాజీ ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు పదవి రావడం పట్ల భీమడోలులో టీడీపీ నేతలు ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అభినందించారు.

భారత ఆహార సంస్థలో రక్తదాన శిబిరం

ఏలూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏలూరు భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)లో రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించారు. గుడ్ సమరిటిన్ బ్లడ్ సెంటర్ సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ రవీంద్ర, మెడికల్ ఆఫీసర్ రాజేంద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పలువురు ఎఫ్‌సీఐ సిబ్బంది రక్తదానం చేశారు. స్థానిక ఎఫ్‌సీఐ మేనేజర్ రగల్ కిరణ్, బ్లడ్ సెంటర్ పీఆర్వో రాజు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న దేవీ నవరాత్రులు

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దేవీనవరాత్రులు గురువారం విజయదశమితో ముగియనున్నాయి. బుధవారం మహార్నవమి సందర్భంగా నగరంలోని అమ్మవార్లకు మహిషాసురమర్దినిదేవిగా అలంకరించి భక్తజనానికి దర్శనమిచ్చారు. ఈ మేరకు ఆలయాల వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చోరీ గ్యాంగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి : సీఐ

పెదపాడు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన ఆరుగురు సభ్యులతో కూడిన గ్యాంగ్ మన పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్టుగా సమాచారం అందిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెదవేగి సీఐ హెచ్. రాజశేఖర్ తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఆటోలను బుధవారం ప్రారంభించారు. సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ ఈ ముఠా సభ్యులు లాడ్జీల్లో తలదాచుకుంటూ నేరాలకు పాల్పడుతున్నారని, మీ ఇళ్ల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కన్పిస్తే వెంటనే 112కు ఫోన్ చేయాలన్నారు. సమాచారాన్ని మరింత మందికి తెలియజేయాలని, పెదవేగి 94407 96635, పెదపాడు 94407 96637, దెందులూరు 94407 96654 నెంబర్లకు తెలియజేయాలని కోరారు. ఏఎస్ఐ గజపతిరావు, హెచ్.సి. వీరబాబు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి : మానవత

ఏలూరు టూటౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రక్తదానం వలన ప్రాణాలు కాపాడవచ్చని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు ఆలపాటి నాగేశ్వరరావు అన్నారు. నేషనల్ వలంటరీల రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా గ్రంథాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దాతల చేత నిరంతరం రక్తదానం చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. రెడ్‌క్రాస్ సొసైటీ పీఆర్‌ఓ రమణ, ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆశ్రం వద్ద దొరికిన బాలిక వివరాలు తెలిస్తే చెప్పండి

ఏలూరు క్రైం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఆశ్రం ఆసుప త్రి పరిసరాల్లో జాతీయ రహదారి పక్కన చెట్ల పొదల్లో దొరికిన ఆరేళ్ల దివ్యాంగ బాలిక వివరాలు తెలిస్తే చెప్పాలని పోలీసులు కోరారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. బాలిక వివరాలు తెలిసిన వారు ఏలూరు డీఎస్పీ సెల్ నెంబర్ 94407 96603 సమాచారం ఇవ్వాలని ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ కోరారు.

నాయక్‌ల ఆందోళనకు పెరుగుతున్న మద్దతు

కామవరపుకోట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మండలంలో నివాసం ఉంటున్న నాయక్ కులస్తులు తమకు గతంలో విధంగా ఎస్టీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరుతూ పది రోజులుగా చేస్తున్న ఆందోళనల్లో భాగంగా బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న దీక్షా శిబిరానికి కూటమి నాయకులు ఘంటా సత్యంబాబు, సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు, కొమరం భీమ్ నాయక్ సంఘ అధ్యక్షులు అంకం రాంబాబు, కార్యదర్శి గోధుమ మధు, కోశాధికారి మీనుగుల నరసింహారావు, సంఘ పెద్దలు మీనుగుల దుర్గారావు, గోధుమ రామకృష్ణ, నల్లమోతుల వెంకటేశ్వరరావు, నల్లమోతుల అప్పన్న, ఖాన్‌వజీర్ పాల్గొన్నారు. ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలంటూ నినాదాలతో హోరెత్తించారు.

కనకదుర్గమ్మ సన్నిధిలో చింతమనేని పూజలు

దెందులూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపన్నపాలెంలోని కనకదుర్గమ్మ తల్లి 35వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్‌కు ఆలయ కమిటీ సభ్యులు కొండేటి హనుమంతు,తోట రామకృష్ణ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి కనక దుర్గమ్మ జ్ఞాపికను అందజేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్(మిల్లుబాబు), పలువురు నాయకులు ఉన్నారు.

కలెక్టర్ ఆదేశాల అమలుకు చర్యలు

బుట్టాయగూడెం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని బుధవారం కేఆర్ పురం ఐటీడీఏలో జరిగిన గ్రీవెన్స్‌లో ఆప్తమిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ ముచ్చిక రంజిత్‌కుమార్ దొర, పీవో కె.రాములు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. క్షేత్రస్థాయిలో కలెక్టర్ ఆదేశాలను కొంతమంది అధికారులు పట్టించుకోవడంలేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

పేద, మధ్య తరగతికి సూపర్ గిఫ్ట్

- ఎమ్మెల్యే చింతమనేని, కలెక్టర్ వెట్రిసెల్వి
- గోపన్నపాలెంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్

దెందులూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):జీఎస్టీ తగ్గింపుతో పేద మధ్యతరగతి వర్గాలకు ఎన్డీయే ప్రభుత్వం సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి అన్నారు. గోపన్నపాలెం పీఈటీ కాలేజీ అవరణలో బుధవారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, సభ్యుల ఆధ్వర్యంలో పండుగ వాతావరణంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రైతులకు డ్రిప్‌లు ఇవ్వలేదని తమ కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాలకు ఉచితంగా ఇస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్హులైన రైతుల రుణ దరఖాస్తులను బ్యాంకర్లు సత్వరమే మంజూరు చేసేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యాయామ కాలేజీ అభివృద్ధికి కలెక్టర్ మరింత చొరవ తీసుకుని సమస్యల పరిష్కారానికి



ట్రాక్టర్ నడుపుతున్న కలెక్టర్ వెట్రి సెల్వి.. సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

ఎంపీ మహేశ్ యాదవ్ సహకారంతో ముందుకెళ్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సవరించిన జీఎస్టీ విధానం వల్ల అన్ని రంగాల ప్రజలకు ఎంతగానో మేలు కలుగుతుందన్నారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. 200 ట్రాక్టర్లతో గోపన్నపాలెం నుంచి వేగవరం, సోమవరప్పాడు మీదుగా లక్ష్మీపురం వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ స్వయంగా ట్రాక్టర్‌ను నడిపారు. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నాగార్జునరావు, దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, మండల అధ్యక్షుడు మిల్లుబాబు, వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ వెంకటలక్ష్మీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు



చాట్రాయి మండల సరిహద్దున ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

చాట్రాయి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):తెలంగాణలో స్థానిక ఎన్నికల నగారా మోగడంతో సరిహద్దులో తెలంగాణ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. తెలంగాణ సరిహద్దున ఉన్న కృష్ణారావుపాలెం- వెంకటాపురం మధ్య ఏర్పాటు చేసిన చెక్ పోస్టులో డబ్బు మద్యం మొదలైనవి అక్రమ రవాణా జరగకుండా అన్ని వాహనాలను తెలంగాణ పోలీసులు తనిఖీ చేస్తుండడంతో ఇరు రాష్ట్రాల సరిహద్దు గ్రామాల ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి రూ.50 వేలకు మించి నగదుతో తెలంగాణలోకి వెళ్లరాదు. అంతకన్నా ఎక్కువ నగదు ఉండి సరైన పత్రాలు చూపకపోతే పోలీసులు సీజ్ చేస్తుండటంతో ప్రజలు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణ ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఏపీ సరిహద్దు ప్రాంతాల ప్రజలు ప్రయాణాలలో నిబంధనలు పాటించక తప్పని పరిస్థితి ఉంది.



పీహెచ్‌సీల వైద్యాధికారుల ర్యాలీ

కొవ్వొత్తులతో వైద్యుల ర్యాలీ

- అత్యవసర వైద్యసేవలకూ దూరం

ఏలూరు అర్బన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో ఇన్‌సర్వీస్ కోటా సీట్ల భర్తీని పాతపద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ పీహెచ్‌సీల వైద్యులు చేపట్టిన ఆందోళనలో భాగంగా బుధవారం రాత్రి ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్, కోమలవిలాస్ కూడలివద్ద మానవహారం నిర్వహించారు. 70మందికి పైగా మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు. బుధవారం నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర కేసులను బహిష్కరించినట్టు ఏపీ పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా నాయకులు డాక్టర్ జోషిమా, డాక్టర్ జ్ఞానేష్, డాక్టర్ అకీబ్ షరీఫ్ వెల్లడించారు. జిల్లాలోని వైద్యాధికారులందరూ శుక్రవారం చలో విజయవాడ ఆందోళనకు తరలి వెళ్తారని వివరించారు. కాగా ఇన్‌సర్వీస్ పీజీ కోటా కింద క్లినికల్ కోర్సుల్లో 30శాతం, నాన్ క్లినికల్ కోర్సుల్లో 50శాతం సీట్లను పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లకు కేటాయించాల్సిందేనని ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఏలూరుజిల్లాశాఖ అధ్యక్షుడు సున్నం శ్రీరాములు దొర ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైద్యుల సమ్మె ప్రభావం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై బుధవారం రాత్రి వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ డీఎంహెచ్‌వోలతో జూమ్ కాన్ఫరెన్సులో సమీక్షించారు. జిల్లాలో బుధవారం 38 మంది వైద్యులు విధులకు హాజరయ్యారని డీఎంహెచ్‌వో వివరించారు.



చింతలపూడిలో సెంట్రల్ లైటింగ్ వెలుగులు

ఎట్టకేలకు మోక్షం

- చింతలపూడిలో నేడు సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

చింతలపూడి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):చింతలపూడి నగర పంచాయతీలో 16 ఏళ్లుగా వెలగని సెంట్రల్ లైటింగ్ సమస్యకు మోక్షం కలిగింది. దాతల సహకారం, మునిసిపల్ శాఖ సంయుక్తంగా ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో నూతన దీపాను పునరుద్ధరించారు. గతంలో పట్టణవాసులు ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేసినా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదు. నగర పంచాయతీగా మారి నాలుగున్నరేళ్లు గడిచినా అధికారులు చర్యలు తీసుకోలేదు. 2005లో రోడ్డు విస్త రణ చేసినప్పుడు రోడ్ల అభివృద్ధితో పాటు సెంట్రల్ లైటింగ్‌ను కోటి రూపాయలతో ఏర్పాటు చేశారు. అప్పట్లో మేజర్ పంచాయతీ పాలక వర్గం ఇవి నాసిరకంగా ఉన్నాయని వీటిని దూరం పెట్టారు. ఆ తర్వాత వెలిగిన రోజులు లేవు. మరమ్మతుల పేరిట నిధులైతే ఖర్చు చేశారు. 2024 ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ తాను గెలిస్తే ఈ లైట్లను వెలిగిస్తానని హామీ ఇచ్చారు.ఆ మేరకు హామీ నిలబెట్టుకుంటూ వీటిని పునరుద్ధరించారు. సాయి బాబా గుడి నుంచి బోయగూడెం పెట్రోలు బంకు వరకు ఉన్న 86 స్తంభాలకు ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేసి ఆ స్తంభాల చుట్టూ రూప్‌లైట్లు ఏర్పాటు చేశారు. విరిగిన స్తంభాల స్థానంలో కొత్తవి వేశారు. ట్రయల్ రన్ జరిపారు. విజయదశమి రోజు గురువారం ఈ దీపాలను వెలిగించడానికి ఏర్పాట్లు చేశారు. దీంతో పాటు పబ్లిక్ కోసం పే యూజ్ మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. మినీ బస్టాండ్‌కు రంగులు వేసి ముస్తాబు చేశారు. వీటిని ప్రారంభించనున్నారు.



నివేశన స్థలాలను కాపాడాలి

నూజివీడు టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ స్థలాలను ఆక్రమణల నుంచి కాపాడాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తుక్కులూరు గ్రామానికి చెందిన అన్నే సురేష్ తదితరులు తెలిపారు. తుక్కులూరులో గతంలో విలేకరులకు నివేశనా స్థలాలు ఇవ్వగా, కొన్ని ఖాళీగా ఉన్నాయని, వాటిని కొందరు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని, ఆక్రమణల నుంచి నివేశనా స్థలాలను కాపాడాలని కోరారు.

బ్యూటీ వెల్‌నెస్‌పై విద్యార్థినులకు శిక్షణ

నూజివీడు టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):నూజివీడు బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో బ్యూటీ వెల్‌నెస్‌పై ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా నైపుణ్యాభివృద్ధి కోర్సును అందిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం వి.అనూరాధ తెలిపారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించే దిశగా దసరా సెలవుల్లో ట్రైనీ రంజిత్ కుమారి ఆధ్వర్యంలో ఈ శిక్షణ అందించి, అనంతరం ధ్రువపత్రాలను అందజేస్తామన్నారు.

నూజివీడులో రక్తదాన శిబిరం

63వ సారి రక్తదానం చేసిన ఆర్టీసీ ఉద్యోగి కృష్ణప్రసాద్



నూజివీడు టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నూజివీడు ఏరియా ఆసుపత్రిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా, జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజారాణి ఆర్ఎంవో శ్రీనివాసులు లాంఛనంగా ప్రారంభించగా, 23 యూనిట్ల రక్తాన్ని సేకరించి బ్లడ్ బ్యాంకుకు తరలించారు. ఈ సందర్భంగా నూజివీడు ఆర్టీసీ ఉద్యోగి కృష్ణప్రసాద్ 63వ సారి రక్తదానాన్ని నిర్వహించారు. ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కీర్తి తదితరులు పాల్గొన్నారు.

సమర్థంగా ఎన్టీఆర్ భరోసా అమలు

మునునూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వ సమర్థవంతంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకాన్ని అమలు చేస్తోందని ఎంపీడీవో పిల్లి ఏసుబాబు అన్నారు. లోపూడిలో లబ్ధిదారుల ఇంటికి వెళ్ళి పెన్షన్ అందజేశారు. గుడిపాడులో టీడీపీ గ్రామ అధ్యక్షుడు మండలపు ధర్మరాజు, ముసునూరులో వార్డు సభ్యుడు రాంబాబు, గోపవరం, చింతల వల్లి గ్రామాల టీడీపీ అధ్యక్షులు ఉప్పలపాటి గణేష్, కాటేపల్లి సురేంద్ర బాబుతోపాటు అయా గ్రామాల్లో కూటమి నాయకులు పెన్షన్లు పంపిణీ చేశారు. మండలంలో 95 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయినట్టు ఎంపీడీవో తెలిపారు.

చాట్రాయి: మండలంలోని చనుబండలో పీఏసీఎస్ చైర్మన్ మోరంపూడి శ్రీనివాసరావు, కూటమి నాయకులు పెన్షన్లు పంపిణీ చేశారు. బుధవారం సాయంత్రానికి 91.72 శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో జి. రాజు తెలిపారు. కూటమి నాయకులు నక్కా రాము, పరసా శ్రీను, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కామినేనిపై దూషణలు సహించం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ముదినేపల్లి, అక్టోబరు 1 (ఆంధ్ర జ్యోతి): కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌పై మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు వ్యక్తి గత దూషణలు చేయడం సభ్యత కాదని నియోజకవర్గ బీజేపీ నాయకులు విమర్శించారు. పార్టీ జిల్లా కో-కన్వీనర్ కోటప్రోలు కృష్ణారావు, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పైడిపాటి శివశంకర్, కైకలూరు ఎంపీపీ అడవి కృష్ణ, నాలుగు మండలాల బీజేపీ అధ్యక్షులు సత్యవోలు నాగలక్ష్మీ, జగదీష్, దుర్గా ప్రసాద్, సమయం యేసుబాబు బుధవారం ముదినేపల్లి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ హయాంలో జరిగిన అప్రజాస్వామిక పాలనకు స్వస్తి పలికి, అభివృద్ధికి బాటలు వేస్తున్న కామినేని పట్ల ఇక ముందు అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎంపీపీ కొండా దుర్గాభవాని

రాజకీయాలకతీతంగా మండలాభివృద్ధికి కృషి చేయాలి

మునునూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):రాజకీయాలకతీతంగా మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావ్ అన్నారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. గత అక్టోబరులో వైసీపీ ఎంపీటీసీలకు కేటాయించిన నిధులకు వర్క్ ఆర్డర్ ఇవ్వనీయకుండా, అభివృద్ధి పనులను కొందరు స్థానిక నాయకులు అడ్డుకుంటున్నారని, ఈ సమస్య పరిష్కరించే వరకు సమావేశానికి వచ్చేది లేదని వైసీపీ ఎంపీటీసీలు ఎంపీడీవో ఏసుబాబుకు తెలపగా ఆ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎంపీపీ దుర్గాభవాని, వైస్ ఎంపీపీ కోటగిరి రాజా, జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రజా ప్రతినిధుల కోటాలో ఇచ్చిన నిధులను సక్రమంగా వినియోగించి నప్పుడే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. అనంతరం పలు అభి వృద్ధి పనులపై తీర్మానాలు చేశారు. వైస్ ఎంపీపీ-2 పాముల గంగాధరరావు, మాజీ ఎంపీపీ కృష్ణకుమారి, ఎంపీడీవో ఏసుబాబు, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

మండవల్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పెరికేగూడెం పాల ఉత్పత్తిదారుల సంఘ సభ్యులకు విజయ డెయిరీ ఆధ్వర్యంలో కూటమి నాయకుడు చాపరాల దుర్గాప్రసాద్ బోనస్ పంపిణీ చేశారు. ప్రభుత్వం గోకులాలు నిర్మించడంతో పాటు పాడి పశువులను కొనుక్కునేందుకు రాయితీ రుణాలను అందిస్తోందని వివరించారు. అనంతరం గ్రామంలోని 175 మంది రైతులకు రూ.1.10లక్షల బోనస్ పంపిణీ చేశారు.

అంత్యక్రియలకు వైష్ణవి సాయం

ముదినేపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెయ్యేరులో లివర్ వ్యాధితో బాధపడుతూ బుధవారం మరణించిన మెరుగుమాల పున్నయ్య అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి ఆర్థిక సహాయం అందజేశారు. ఒంటరిగా జీవిస్తున్న పున్నయ్య దహన సంస్కారాలకు రూ.5 వేలు సహాయాన్ని వైష్ణవి తరఫున ఆమె తండ్రి డాక్టర్ మనోజ్ మృతుడి బంధువులకు అందజేశారు.

క్రైమ్ కార్నర్

థియేటర్ సిబ్బందిపై దాడి.. యువకులపై కేసు

కైకలూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి సినిమా హాలులో గొడవ చేసిన నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్సై డి. వెంకట్‌కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి కైకలూరు మాగంటి థియేటర్‌లో ప్రేక్షకులను ఇబ్బందులకు గురి చేయడంతో నలుగురు యువకులపైన థియేటర్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం థియేటర్ సిబ్బంది అయిన సుంకర వెంకటేశ్వరరావు, మేనేజర్ గణేష్ ఆ యువకుల టిక్కెట్ల డబ్బులు వెనక్కి ఇచ్చి ప్రేక్షకులకు ఇబ్బంది కలుగుతున్నందున బయటకు వెళ్లమని కోరడంతో తాను మాజీ ప్రజాప్రతినిధి కుమారుడనని ఒక వ్యక్తి అసభ్యంగా మాట్లాడుతూ చంపేస్తానని థియేటర్ యాజమాన్యాన్ని బెదిరించి కర్రతో దాడి చేశాడని, బాధితులు కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, నిందితులు కలిదిండి మండలం పడమటిపాలెం పాము సూర్యకుమార్, గంగుల ధనరాజ్, కె హేమంత్ కుమార్, కరేటి సాయికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై ఫిర్యాదు

ముదినేపల్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):పెయ్యేరు శివారు అప్పారావుపేటకు చెందిన దేసిన ప్రియాంకకు పెడన మండలం కోట్ల వానిపాలెంకు చెందిన పరసా శ్రీకాంత్‌తో 2018లో వివాహమైంది. భార్యా భర్తలిద్దరూ హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తున్నారు. వివాహ సమయంలో బంగారం, నగదు, పొలం కట్నంగా ఇచ్చారు. కొంతకాలంగా పొలాన్ని భర్త పేరున రాయాలని అత్తమామలు ప్రియాంకను వేధిస్తున్నారు. ఆమె ప్రసవానికి పుట్టింటికి వచ్చింది. పొలం విషయాన్ని వివాదంగా తీసుకుని అత్తింటి వారు ఆమెను బిడ్డతో సహా కాపురానికి తీసుకువెళ్ళడం లేదు. దీంతో ప్రియాంక బుధవారం ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	242
చికెన్ స్కిన్‌లెస్	252
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



కోరుకొల్లు, గురజలో మహిషాసురమర్ధిని అలంకరణ

జయజయహే మహిషాసుర మర్దిని..

మహిషాసుర మర్దినిగా అమ్మవార్లకు అలంకారం

భక్తుల విశేష పూజలు, హోమాలు



బలివేలో రాజరాజేశ్వరిదేవి, నూజివీడులో కోట మహిషమ్మ

నూజివీడు టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నూజివీడు కోటమహిషాసురమర్దిని అమ్మవారు భక్తులకు నిజరూపంలో దర్శనమిచ్చారు. దేవదాయ, ధర్మదాయశాఖ ఈవో అలివేణిశ్రీ నేతృత్వంలో అమ్మవారికి పూజలను ఆలయ అర్చకులు సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాగా మంత్రి పార్థసారథి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

మునునూరు: బలివే రాజరాజేశ్వరి మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ బొమ్మకంటి శ్యామలరావు, ఈవో పామర్తి సీతారామయ్యలు పూజలు చేశారు. మహిళలు సాముహిక కుంకుమ పూజలు చేశారు.

పార్వతీదేవిగా శ్రీశ్యామలాంబ అమ్మవారు

కైకలూరు: శ్రీశ్యామలాంబ అమ్మవారి శ్రీచండీ మహాయాగసహిత శ్రీదేవీశరన్నవ రాత్రి మహోత్సవాల్లో బుధవారం అమ్మవారు పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు పెద్దఎత్తున క్యూలైన్లో నిలబడి అమ్మవారిని దర్శించుకున్నారు. దాతల సహకారంతో అమ్మవారికి పుష్పాలంకరణ, భక్తులకు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. ఉభయదాతల పూజల్లో 34 మంది దంపతులు, చండీహోమం పూజల్లో 30 మంది దంపతులు పాల్గొని పూజలు చేయగా వారిని ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు శేష వస్త్రాలతో సత్కరించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చింతపల్లి వీరరాజరాజేశ్వరి, శ్రీనివాస రావు దంపతులు పూజలు చేశారు. మురళీకోలాటం, జడకోలాట ప్రదర్శన, పాదర్తి సిస్టర్స్ కూచిపూడి నృత్యప్రదర్శన, హేమాసుందర బృందం అభినయ నృత్యభారతి ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ ఈవో వీఎన్‌కె శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. దసరా మహోత్సవాల్లో చివరిరోజు అయిన గురువారం శ్రీశ్యామలాంబ అమ్మవారు శ్రీమహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

●కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారికి అర్చనలు, కుంకుమపూజలు ఘనంగా నిర్వహించారు. అటపాకకు చెందిన వేగేశ్న ప్రసాదరాజు దంపతులు ఉభయదాతల పూజలు చేశారు. ఆలయ అధికారి కూచిపూడి శ్రీనివాసు ఏర్పాట్లు నిర్వహించారు.



కైకలూరు శ్రీశ్యామలాంబ ఆలయంలో చండీహోమం పూజల్లో భక్తులు

మండవల్లి: లోకుమూడి దత్తాశ్రమంలో కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ దంపతులు, ఈవో గురజాడ ఉదయశంకర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కోలాటం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. మండవల్లి విజయదుర్గమ్మ మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కలిదిండి: సంతోషపురంలో దుర్గమ్మ మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. కోరుకొల్లు, చినతాడినాడ తదితర గ్రామాల్లో దుర్గమ్మను మహిషాసురమర్దినిగా అలంకరించి పూజలు చేశారు.

ముదినేపల్లి: దేవపూడిలో విజయదుర్గాదేవిని ఆలయ చైర్మన్ దాసరి భగవాన్ దాస్ ఆధ్వర్యంలో బుధవారం మహిషాసురమర్దినిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ముదినేపల్లి వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో మహిషాసుర మర్దినిగా అమ్మవారిని అలంకరించారు.



దత్తాశ్రమంలో రూరల్ సీఐ రవికుమార్, ఈవో ఉదయశంకర్ పూజలు

పింఛన్ల పెంపు చారిత్రక నిర్ణయం

- గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి
- ఆగిరిపల్లిలో పింఛన్ల పంపిణీ వృద్ధులకు సత్కారం
- జీఎస్టీపై కలెక్టర్‌తో కలసి అవగాహన ర్యాలీ



ఆగిరిపల్లిలో ట్రాక్టర్ నడుపుతూ జీఎస్టీపై అవగాహన.. వృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధులకు పాదాభివందనం చేస్తున్న మంత్రి

ఆగిరిపల్లి, అక్టోబరు 1 (ఆంధ్ర జ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు ఒకేసారి పెంచడం చారిత్రాత్మకం నిర్ణయమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సం బంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని అడవినెక్కలంలో బుధవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కార్యక్రమంలో మంత్రి, కలెక్టర్ వెట్రిసెల్వి పాల్గొన్నారు. బుడ్డగూడెం కాలనీలో లబ్ధిదా రుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందజేసి మంత్రి మాట్లాడుతూ దేశంలోనే మన రాష్ట్రం అధిక పెన్షన్లు పంపిణీలో ప్రథమ స్థానంలో ఉన్నామన్నారు. జిల్లాలో 2లక్షల 60వేల 735 మందికి 114.14 కోట్లు రూపాయిలు పెన్షన్లదార్లకు పెన్షన్ల సొమ్ము పంపిణీ చేశామన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, ఎంపీడీవో బి. భార్గవి, డిప్యూటీ తహసీల్దార్ జి. పవన్‌కుమార్, ఎవో భవాని, టీడీపీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలు అన్ని వర్గాలకు ఊరట

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో అన్ని వర్గాలకు ఎంతో ఊరట అని మంత్రి అన్నారు. బుధవారం అడవి నెక్కలంలో జీఎస్టీ తగ్గింపుపై కలెక్టర్ కె వెట్రిసెల్విత్తో కలిసి ట్రాక్టరుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నిత్యావసర వస్తువులు, మందులపై జీరో శాతం జీఎస్టీ అమల్లోకి తెచ్చిందన్నారు. వ్యవసాయ పరికరాలపై భారీగా జీఎస్టీ తగ్గించిందన్నారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద వ్యవసాయ పరికరాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి రైతులకు, ప్రజలకు జీఎస్టీపై అవగాహన కల్పించారు.

వృద్ధాప్య సంరక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలి

ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని అడవి నెక్కలం గ్రామ సచివాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సారథి మాట్లాడుతూ వృద్ధాప్య సంరక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడం మనందరి బాధ్యత అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులకు ఆర్థిక భద్రత, గౌరవం, ఆరోగ్య సంరక్షణ హక్కులను పరిరక్షించవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం వృద్ధులను సన్మానించారు.



వేమవరప్పాడులో అవగాహన ర్యాలీ



చాట్రాయిలో జీఎస్టీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

సూపర్ జీఎస్టీతో సూపర్ సేవింగ్స్

- జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించిన నాయకులు, అధికారులు

కైకలూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో వ్యవసాయ పరికరాలు ధరలు భారీగా తగ్గాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వేమవరప్పాడులో జీఎస్టీ తగ్గింపుపై ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాథరాజు, బోడావుల జగదీష్, డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, సర్పంచ్ నున్న రాంబాబు, కూటమి నేతలు కేకే బాబు, బోడావుల వసంత రావు, గోవిందరాజు, ఏడీ పార్వతి, వ్యవసాయాధికారిణి ఆర్. దివ్య పాల్గొన్నారు.

నూజివీడు: జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై నూజివీడు మండల స్థాయిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ అధికారి పలగాని చెన్నారావు మాట్లాడుతూ ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు, బయో పెస్టిసైడ్స్, డ్రిప్ ఇరిగేషన్ సామగ్రి, ఆక్వా పరికరాలపై 12 నుంచి 5 శాతానికి తగ్గించారని, డ్రోన్, ట్రాక్టర్ టైర్లు, విడిభాగాలపై జీఎస్టీ 18 నుంచి 5 శాతానికి తగ్గించారని దీంతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఉద్యానవన శాఖ అధికారిణి ఆర్.హేమ, బీజేపీ నాయకులు గోగినేని శ్రీనివాస కుమార్ అప్పారావు, మొర్సపూడి టీడీపీ నాయకుడు పిన్నమనేని ప్రదీప్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లి: కేంద్రం తీసుకువచ్చిన సూపర్ జీఎస్టీతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని వాణిజ్య పన్నుల ఉప కమిషనర్ సునీత తెలిపారు. పెరికేగూడెంలో వ్యవసాయ, మత్స్య, పశుసంవర్ధకశాఖల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, స్ప్రేయర్లు ఇతర యంత్ర పరికరాలు 18 శాతం ఉన్న జీఎస్టీని కేవలం 5శాతానికి తీసుకువచ్చిందని అలాగే చేపలు, పశువులకు సంబంధించిన మందులు 0 శాతం, యంత్ర పరికరాలపై 5 శాతానికి జీఎస్టీ తగ్గిందని దీని వల్ల చిన్న, మధ్యతరగతి రైతులకు ఎంతో వెసులుబాటు ఉంటుందన్నారు. వ్యవసాయశాఖ ఏడీ జి. వెంకటమణి వరప్రసాద్ పెద్దఎత్తున నాయకులు పాల్గొన్నారు.

చాట్రాయి: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించటం వల్ల రైతుల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని ఏవో శివశంకర్ అన్నారు. చాట్రాయ రైతుసేవా కేంద్రం వద్ద బుధవారం సూపర్ జీఎస్టీపై రైతులకు అవగాహన కల్పించారు. ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు, బిందు సేద్య సామగ్రి మొదలైన వాటికి 12 నుంచి 5 శాతం వరకు జీఎస్టీ తగ్గించారన్నారు. ఎంపీడీవో జి. రాజు, కూటమి నాయకులు మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాస రావు, నక్కా రాము, ముత్తారెడ్డి, సంజీవరెడ్డి, శర్మ, జగన్, రామారావు పాల్గొన్నారు.

మునునూరు: పేద, మధ్యతరగతి వర్గాలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ జీఎస్టీపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో పిల్లి ఏసుబాబు అన్నారు. బుధవారం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్‌పై కొర్లకుంటలో అవగాహన ర్యాలీ నిర్వహించా రు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నిత్యావసరాలపై గతంలో 18 శాతం జీఎస్టీ ఉండేదని, ఇప్పుడు 5 శాతానికి తగ్గించడం వల్ల 13 శాతం నగదు ఆదా అవుతుందన్నారు. అలాగే ట్రాక్టర్లు, కార్లు, మోటార్ వాహనాలు, టీవీలు, ఏసీల ధరలు సైతం తగ్గాయని వివరించారు. డిప్యూటీ ఎంపీడీవో బీఏ సత్యనారాయణ, కార్యదర్శి యు.సాయి కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి: జీఎస్టీ తగ్గింపుతో వ్యవసాయ పరికరాల కొనుగోళ్లలో రైతులకు కలిగే ఆర్థిక ప్రయోజనాలపై బుధవారం ముదినేపల్లిలో వ్యవసాయ శాఖ అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించింది. ఏవో వేణుమాధవ్ ఆధ్వర్యంలో స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద వ్యవసాయ యంత్రాలు, పరికరాలు, డ్రోన్లను ప్రదర్శించారు. జీఎస్టీ తగ్గింపు వల్ల చిన్న, మధ్య తరగతి రైతులకు కూడా ధరలు అందుబాటులోకి వచ్చాయని ఏడీఏ వెంకటమణి వివరించారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగ న్మోహ నరావు, బీజేపీ జిల్లా కో-కన్వీనర్ కోటప్రోలు కృష్ణా రావు, నీటి సంఘం అధ్యక్షుడు పోసిన పాండు రంగా రావు, ఎంపీడీవో రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

కలిదిండి: సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై బుధవారం కలిదిండిలో వ్యవసాయ అధికారులు కూటమి నాయకులు రైతులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి విద్యాసాగర్ మాట్లాడుతూ ట్రాక్టర్ల స్పేర్ పార్ట్స్ తక్కువ ధరకే లభిస్తాయని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, అగ్నికుల క్షత్రియ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ల డైరెక్టర్లు అంద్రాజు శ్రీనివాస్, లంకా రత్నారావు, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.